ఆదివారం
ప్రజాశక్తి
జూలై 3, 2005



భార్యను హింసిస్తే.... బందిఖానా....

హ్యాపీ బర్త్‌డే

3.7.2005 నుంచి 9.7.2005 వరకు

సూర్య సోనిక
6సం॥, 4.7.1999
రమాదేవి-శ్రీనివాస్
కాజ-గుంటూరు

మేఘన
2సం॥, 4.7.2003
జయలక్ష్మి-ఈశ్వరరావు
శ్రీకాకుళం

యువశ్రీ
4సం॥, 4.7.2001
బాలాహారతి-మాణిక్యాలరావు
యానాం-తూ॥గో॥

తరుణ్
7సం॥, 4.7.1998
రజని-శ్రీనివాస్
బోనకల్లు-ఖమ్మం

సాయి సుస్మిత
8సం॥, 5.7.1997
నర్మద-రాజారావు
వైరా-ఖమ్మం

సాత్విక
1సం॥, 6.7.2004
కల్పన-శ్రీను
వైరా-ఖమ్మం

సాయి ప్రణీత్
1సం॥, 7.7.2004
వెంకటలక్ష్మి-కృష్ణయ్య
హుడా-విశాఖపట్నం

సరోజారాయ్
8సం॥, 7.7.1997
పద్మ-కమలాకర్
హైదరాబాద్

శ్రీజ
8.7.2002
శిరీష-శేఖర్
కొత్తగూడెం-ఖమ్మం

సాయి వర్షిత్(సన్ని)
4సం॥, జులై-2001
భాగ్యలక్ష్మి-నర్సింహ్మ
ఆమన్‌గల్-మ॥నగర్

ప్రేమ్‌కుమార్
3సం॥,జులై-2002
అనూష-వసంత్
సారంగపూర్-నిజామాబాద్

ప్రకాష్
1సం॥, 7.7.2004
విజయలక్ష్మి-శివబాబు
కృష్ణలంక-విజయవాడ

అక్షిత కృష్ణ
జులై-3
త్రివేణి-సురేష్
శింగనమల-అనంతపురం

అభినయ్‌కుమార్
1సం॥, 9.7.2004
భారతి-రాజేష్
అప్పాయపాలెం-కడప

సందీప్
3సం॥, 4.7.2002
పుష్ప-తిరుమలరావు
చీడిగ-తూ॥గో॥

స్వాతి
3సం॥, 8.7.2002
వేణు-రామకృష్ణ
ఎర్రకొండ-ధవళేశ్వరం

ఆశాప్రమతి
1సం॥,జులై-2004
ఉమాచండీశ్వరి-సతీష్
తాళ్లరేవు

రీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం



కవర్‌స్టోరీ

19వ తేదీ ఆదివారం అనుబంధంలో ఒకరికి ఒకరు కవర్‌స్టోరీ బాగుంది. ఆర్థిక విషయాల వల్ల, వాయిదాల పద్ధతిలో పీడించే "ఆడంబరపు ఆచారం" వల్లా కాపురాల్లో కలతలు వస్తుంటాయనేది విదితమే. ఐనా ఆరెంటినీ మించి సంసార మధురిమలను సవ్యంగా పలికించడానికి, పండంటి కాపురానికి 12 సూత్రాలు తెలియజేశారు.

జీవనశైలిలో టైమ్‌గడవడం లేదు. అనే అంశం పొద్దుపోవడం లేదనేవారికి చక్కని సందేశం. ఆరోగ్యం ప్లస్ అవయవాలు సవ్యంగా ఉన్నపుడు రోజుకు 24 గం॥ చాలని నేటి యాంత్రిక జీవనకాలంలో నత్కాలక్షేపానికి బెంగలేదు. పొద్దు గడవనివారు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టవచ్చు. విద్యార్థులకూ, ఉద్యోగార్థులకూ తగిన సమాచారం సేకరించి తమ తోడ్పాటు ఇవ్వొచ్చు. కథనంలో ఈ విషయమై సందేశాత్మకత పెంచిఉంటే బాగుండేదనిపిస్తుంది.

'రంగులజీవితం' కవిత బాగుంది. రియల్ స్టోరీ బాగుంది.

ఎస్.కె. జహంగీర్,
విడవలూరు, నెల్లూరుజిల్లా.

కవర్‌స్టోరీ "ఒకరికోసం ఒకరు" ఆద్యంతం ఆసక్తిదాయకంగా కొనసాగింది. నిజంగా 'పెళ్లి' అనేది ఒకరికొకరు (భార్యాభర్తలు) కలిసిమెలిసి జీవించి, కష్టసుఖాలను సహించి, జీవితంలో ఎత్తుపల్లాలను ధైర్యంతో, ఓపికతో నిభాయించే ఓ అద్భుత బంధాన్నే వేసుకొంటుంది అనడంలో సందేహం లేదు. అతిశయోక్తీలేదు. పరాయి ఆడపిల్లను 'పెళ్లి' ద్వారా భార్యగా స్వీకరించిన పిదప ఆ స్త్రీని ఎలాంటి వేధింపులకు లోనుచేయక (భర్త మరియు అత్త మామలు తదితరులు) కంటికి రెప్పలా చూసుకొని ఆనందాలను వెల్లి విరిసేలా చేయడం, ప్రతి విజ్ఞత ఉన్నవాడు చేసే పని ఇదే. కాని నేడు అలాంటి ఆప్యాయతానురాగాలు అంతంకాకున్నను ఇంకా 'మానవత్వం' జీవించే ఉన్నదన్నది నగ్నసత్యం. చాలామంది కవర్‌స్టోరీ అందించారు. కృతజ్ఞతలతో.

ఎం.డి ముస్తఖీమ్,
ఛావిని వీధి, కొల్లాపూర్.

హ్యాట్సాఫ్ టు రవి హ్యాట్సాఫ్

పి. జ్యోతి గారి కథ మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది. మనిషి బాహ్య సౌందర్యం కంటే మనసు ఎంతో నిర్మలమైనదని ఈ రచనలో చాలా చక్కగా వర్ణించారు. ముఖ్యంగా "రవి" పాత్రలో ఇది కనిపిస్తుంది. మాలాంటి వారికి ఈ రచన ఎంతో ఆలోచింపజేసింది.

జె. శ్రావణి, పాల్వంచ.

కథ సందేశాత్మకంగా ఉంది. రవి పాత్ర చాలా అరుదైన నిస్వార్థ త్యాగాన్ని ప్రతిబింబిస్తోంది. అవకాశం వస్తే మేమూ ఇటువంటి సహాయం చేయాలనే స్ఫూర్తి కలిగించింది. దీనివల్ల కలిగేది ఆత్మసంతృప్తి మాత్రమే. ప్రచారం అవసరం లేదు అని తెలిసింది.

సి. హెచ్. సీత
కొత్తగూడెం, ఖమ్మంజిల్లా.

19వ తేదీ ప్రచురించిన కథ చదివి చాలా ఆనందించినాము. అందులో నునామీ బాదుతురాలికి రవి చేసిన సహాయం నిజంగా ఎంతో సహృదయంతో చేసినదిగా అనిపించు చున్నది. రవి యొక్క చర్య ప్రస్తు సమాజానికి ఎంతో ఆదర్శంగా వున్నది. ప్రస్తుత సమాజానికి ఎంతో మార్గదర్శనీయం చేయుచున్నది.

వై. శేషగిరి రావు,
భూపాలపల్లి, వరంగల్‌జిల్లా.

మనలో మాట

"మనలోమాట–సొమ్మొకరిదీ... సోకు ఎవరిదో...? గుడిమాన్యాల అమ్మకాల కుంభ కోణాన్ని పత్రికలు గుట్టురట్టు చేశాక నేతల్లో కలకలం మొదలై ఖద్దరు లోకాన్ని దద్దరిల్ల జేసింది. గుడిలో లింగాల్ని మింగే జంగాలకు, గుడిమాన్యాల్ని మింగడం ఓ లెక్కా? సిగ్గు సిగ్గు.

బి. రాజేశ్వర్,
పొన్కల్, ఆదిలాబాద్.

"అలనాటి జ్ఞాపకాలు"

అలనాటి గాయని "స్వర్ణలత" గారి గురించి జూన్ 19 ఆదివారం అనుబంధంలో ప్రచురించి అలనాటి జ్ఞాపకాన్ని మరొక్క మారు నెమరు వేయించారు. లీల, జిక్కి, జమునారాణి, సుశీలగార్లతో ఏ విధంగానూ తీసిపోని సుమధుర కంఠస్వరం లతగారిది. జన్మ బాల్యం, విద్య, నాట కానుభవం, శాస్త్రీయ సంగీత అభ్యసనం చిత్రపరిశ్రమకు పరిచయం మొదలగు జీవిత విశేషాలను సమూలంగా తెలియజేసి నందుకు ధన్యవాదాలు. అలాగే అలనాటి కళాకారుల్ని పాఠకులకు ప్రతీవారం ముందుంచి నేటి తరానికి స్ఫూర్తి గొలిపేందుకు మన ప్రజాశక్తి వేదిక కావాలని ఆకాంక్షిస్తూ.

యర్రమోతు ధర్మరాజు,
ధవళేశ్వరం, తూ॥గో॥ జిల్లా.

జోరు చూడూ... తీరు చూడూ...!

మన జానపద గాయకులు నిక్కచ్చి నిజాలు పాడిమరీ వినిపిస్తారు కానీ...మనం పట్టించుకోం. తీరా అంతా జరిగాక "అరే ఇది అచ్చు అట్టాగే జరిగిందే" అనుకుంటాం.

"జోరు చూడూ...తీరు చూడూ...దున్నపోతుల బారు చూడు" అని లల్లాయిపదంగా ఈ చెవితో విని ఆ చెవితో వదిలేస్తాం. తీరా అవే పచ్చినిజాలుగా మనముందు జరిగితేగానీ ఆ జానపదుడి ముందుచూపు మన చూపుకి అనదుమరి!

ఏం మనిషివిరా...ఏమన్నా చలనంలేకుండా దున్నపోతులా అలా నిలబడతావేమిరా అని కోపంగా తిట్టే తిట్టులో సదరు వృషభ స్వభావం ఇట్టే తెలిసిపోతుంది. అంతగా ఫేమస్ మరి! తిట్టేవాడికీ ఎంతగా తెలుసో...తిట్లు తినేవాడికీ, వినేవారికీ అంతగా తెలిసిన విశ్వవిఖ్యాత పోలిక!

గత కొన్ని శతాబ్దాలుగా సాహిత్య వీధుల్లోనూ, మరికొన్ని దశాబ్దాలుగా రాజకీయ రచ్చబండల్లోనూ సామెత రూపాన ఈ దున్నపోతేశ్వర్రావుల విహారం మహాజోరుగా ఉందిలేండి.

అధికార మకర దున్నపోతులు కాలగతిన ప్రతిపక్ష స్థానానికి వస్తారు. కానీ అదేం విడ్డూరమోగానీ ఆ ప్రతిపక్షస్థానంలో నుండి వీక్షిస్తే తమ ఒకప్పటి రూపురేఖల్నే ఎదుటివారిలో చూసి చచ్చేంత ఆశ్చర్యం ప్రకటిస్తారు. ఆనాటి తమ బుద్ధులే వేరేవారు కొనసాగిస్తే నిరసన రంకెలు వేస్తారు.

కానైతే సకల వృషభాల లక్షణాలు ఒక్కటేకదా అన్నట్లు ఎంత వాన కురుస్తున్నా తనమీద కాదులే అన్నట్లు కదలక మెదలక నిండైనవానలో కొలువదీరిన తీరుగా...సిగ్గుపడక సీటు వదలక చిరస్థాయి స్థానాల్ని కోరుకుంటారు.

కాపోతే ఏంటో చెప్పండి...

ప్రతిపక్షంలోంచి అధికారపక్షంలోకి పయనించినవారు చేస్తుందేవిటో చెప్పండి!

జూనియర్ డాక్టర్ల గతసమ్మెకు మద్దతు పలికినవారే... ఆర్టీసీ వారి నిన్నటిసమ్మెకు అండగా నిలిచినవారే...నాటి పెట్రో ధరలపెంపుకి మండిపడ్డవారి పక్కనున్నవారే... వారే... వారే... వారే ఇలా చాలా లిస్టుందిలేండి. ఆ నిరసన జడివానల్లో తడిసి ముద్దయిన వారే...

కానిప్పటి నమ్మెల కుండపోతవానకు కిమ్మన్నాస్తి సిద్ధాంతారాధకులైనారు.

ఇలాంటప్పుడే...

అధికార దున్నపోతుపై అర్జీల వాన సరిపోదు...ఉద్యమాల ముల్లుగర్రతో పొడవాల్సిందే అన్న కవివాక్కు గుర్తుకు వచ్చేది.

❖

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం... . . . 4
కవర్ స్టోరీ . . . 5
బాలల కథ . . . 11
బాలనేస్తాలు . . . 12
ఇంతి సంగతులు . . . 16
కచేరి . . . 17
ఆరోగ్యం . . . 18
పుస్తక పరిచయం . . . 20
జీవనశైలి . . . 21
న్యాయసలహాలు . . . 24

ఇంకా...

కృషితో నాస్తి దుర్భిక్షమ్

కథ ... 8, 9



అంబులెన్సు డ్రైవర్

రియల్ స్టోరీ ... 14, 15

"పిచ్చివాళ్ల ప్రపంచం"

హిందీ నాటకం

కళాసాహితి . . . 22, 23

కడుపులో చిప్ చిట్టా!



"కడుపులో పెట్టి దాచుకోవాలి" అని ఎవరన్నా అనగానే ఓహో మనమంచే కదా చెప్పిందనివిస్తుంది ఎవరికైనా! కానీ ఆ మాట ఢిల్లీ మున్సిపాలిటీవారన్నారో...వారన్నదాన్ని ఆవులూ-గేదెలు-ఎద్దుల-దున్నపోతులంగార్ల యజమానులు పాటించలేదో... ఇక చూస్కోండి. ముప్పతిప్పలు పెట్టి మూడో, నాలుగో చెరువుల నీళ్ళు తాగించి, ఆ నీళ్ళకూడా పన్ను వడ్డించేస్తారు. ఇంతకీ అసలు విషయం ఏవిటంటే ఢిల్లీ మహానగర నడిరోడ్లపై పశువులు శయనించి ట్రాఫిక్‌కు ఎనలేని ఆటంకం కలిగిస్తున్నాయి. ఎన్నివిధాల చర్యలు తీసుకున్నా...వాటిని తోలుకుపోయి తమ గొడ్ల చావిట్లో కట్టేసిన పాపాన పోవడం లేదు. వాటిని అరెస్టు చేసి పశువుల కాపరి డ్యూటీలో ఉండి చొచొ...ఛో స్వరాలతో వాటిని అదిలించుటయో, సదరు వృషభరాజుల, వృషభరాణుల యజమానులెవ్వరాయని వెదుకుటయో, ఎటూ పాలుబోక బిక్కమోహానేసెనొక కానిస్టేబు... ఈ బాధ పడలేక ఢిల్లీ వారు ఓ హైటెక్ ఆలోచన చేశారు. మైక్రో చిప్‌ను మాత్రలాగా ఆ పశువు కడుపులోకి పంపమని ఆదేశిస్తున్నారు. అలా తమ పశువుల కడుపులో చిప్ పెట్టేందుకు అనుమతిస్తేనే లోన్లు, మెడికల్ ఇన్సూరెన్సులు ఇస్తామని అంటున్నారు. దాని కడుపులో దాచుకున్న చిప్‌లో పశువు బ్రీడ్‌వివరాలు, ఆరోగ్యవివరాలతో పాటు దాని యజమాని అడ్రస్సు నమోదు చేసి ఉంటుంది. రాజధాని నగరంలో రోడ్డుపై దర్జాగా పడకేసిన పశువు కడుపులోని చిప్ ఇన్ఫర్మేషన్ బట్టి కంప్యూటర్‌లో దాని యజమాని ఎవరో పట్టుకుని....ఇక ఆ తరువాత షరా మామూలే!

సంతకం ఇంగ్లీషులో చేస్తేనే...

ఒరిస్సాలో కియోంజార్ గ్రామ అమ్మణికెందుకో అంత పట్టుదల మనకు తెలియదు కానీ... ఇంగ్లీషులో సంతకం చేయడంరాని ఈ మొగుడు నాకొద్దుకాక ఒద్దు అని భీష్మించుకుంది. పెళ్ళికుమారులంగారి బడిఎగవేత విషయం తెలిసేటప్పటికే మెడలో మూడుముళ్ళ ఎల్లో త్రెడ్ పడిపోయింది ఇప్పుడేం చేయాలా అని తెగ ఉద్రేకపడిపోయిందటా పెళ్ళి కూతురు. ఇంగ్లీషు కోసం తన కాపురాన్నే పణంగా పెట్టింది. ఇంగ్లీషులో సంతకం పెట్టాకే ఏ ముద్దూముచ్చటైనా అనేసరికి పెద్దలు పెద్దలూ గుమికూడారు. ఆ ...దాన్దేముందమ్మా...అని పోలీసులు కూడా ఓ మాట వదిలి నచ్చచెప్పబూనారు. అయినా వీసమంత కూడా పట్టుసడలనివ్వలేదు ఆ డిగ్రీ చదివి పెళ్లిపల్లకీ ఎక్కిన వనిత.

డ్యాన్స్...రోబో బేబీ డ్యాన్స్ డ్యాన్స్

జపాన్‌వారు ఎంతో తెలివిగల వారమని ఎన్నెన్ని విధాల రుజువుపరుచుకొను ప్రయత్నాలో చెప్పలేం. వింతవింత యంత్ర ఆవిష్కరణలో ముందుంటున్నారీ జపనీయులు. ముఖ్యంగా రోబోలను తయారుచేయడంలో తమ తరువాతే ఇతరులని నిరూపించుకుంటున్నారు. తిండి తినిపించడానికో రోబో, తిండి వండేందుకో రోబో, పక్క వేసేందుకో రోబో, జాగ్రత్తగా కావలియుండడానికో రోబో...ఇలా జీవితంలో ప్రతీ సందర్భానికో రోబో తయారుచేసి పెట్టుకున్నారు. అంతటితో ఆగలేదు మరి. డ్యాన్సుచేసేందుకో సైదోడుగా ఓ యంత్ర అతివను కూడా తయారు చేసుకుని డ్యాన్సుచేసే చూపించు తున్నాడీ టకహిరో తకేడా అనే పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థి. ఎదుటివారి ముందుముందు కదలికలను పసిగట్టి అందుకు అనుగుణంగా కదిలే సెన్సర్ జ్ఞానమున్న చిప్ ఏర్పాటుచేసిన ఈ రోబోని

ప్రపంచ ఎక్స్‌పో అయిచీ 2005లో మొన్నటి జూన్ 9న ప్రదర్శనకు, అమ్మకానికీ పెట్టారు.

కార్టూన్ కదంబం


పెట్రోలు దెబ్బ కాదు...
కూరగాయల దెబ్బకి...
హరి

నిన్న
నేడు


పన్నులు
ప్రభుత్వం


పరోక్ష పద్ధతి
మున్సిపల్ ఎన్నికలు
ఇలా అయితే తక్కువ దెబ్బలతో తప్పించుకోవచ్చులే..!



భార్యను హింసిస్తే... బందిఖానా

అమృత

లావణ్య చదువుకోకపోయినా మనిషి జంతువు నుండే పుట్టాడని గట్టిగా నమ్ముతుంది!. అయితే బయటికి చెప్పే ధైర్యం లేదు! భర్త తనతో ఇంటెడు చాకిరీ చేయిస్తాడు. గేదెల సంరక్షణ దగ్గర నుంచి పాలేర్లకు చద్దనం పెట్టే వరకు అన్ని పనులూ ఆమె చేయాల్సిందే. అంతే కాక పుట్టిన నలుగురు సంతానం ఆలనాపాలనా చూడాలి. ఇంత చేసినా, ఎప్పుడైనా చిన్న పొరపాటు జరిగితే గొడ్డుని బాదినట్లు బాదుతాడు భర్త. ఆమె శరీరంపైన కర్ర దెబ్బ పడని చోటు లేదు. బాధ భరించలేక అనేక సార్లు ఇల్లు విడిచి పోవాలనో, ఇంత విషం తిని చావాలనో... అనుకునేది. మరుక్షణం కడుపున పుట్టిన పిల్లలు గుర్తుకురావటంతో ధైర్యం చేయలేకపోయేది.

నెల్లూరు జిల్లా దూబగుంటకు కాపురానికి వెళ్ళింది సుజాత. అ గ్రామం ఆదర్శ ప్రగతికి అద్దం పట్టేదని ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరంలేదు. అయితే ఆ చైతన్యం వెనుక 'నేనూ ఉన్నా' అంటూ ఆటవిక తత్త్వం వెక్కిరిస్తుంది!. అదే గృహ హింస. అక్కడి మహిళలు చైతన్యంతో భర్తలను తాగుడుకు దూరం చేయగలిగారే కానీ మనిషి రూపంలో ఉన్న మృగాన్ని తరిమేయలేకపోయారు. దాన్ని పట్టించుకునే వారే కరువయ్యారు.

ఆత్మహత్యా ప్రయత్నం చేసిన మహిళలిచ్చే మరణ వాఙ్మూలంలో 'స్టావ్ ప్రమాదం, కడుపు నొప్పి భరించలేక...' అని చెపుతారే తప్ప అత్తింటి ఆరళ్ళకు అని చచ్చినా చెప్పరు. రంగారెడ్డి జిల్లాలో అపర్ణ అనే అమ్మాయికి బాల్య వివాహం జరిగింది. పదిహేనేళ్ళ ఆ అమ్మాయి గత మూడేళ్ళుగా మొగుడు చేతిలో తిన్నులు తింటూనే ఉందితప్ప, భర్త మీద ఫిర్యాదు చేయలేదు. ఎందుకంటే, ప్రతి ఇంట్లోనూ అమ్మని నాన్న కొట్టటం సామాన్యమైన విషయం. భార్య అనే మనిషి ఎదురు తిరిగితే మహా ఘోరం చేసినట్టుగా సమాజంలో చెవులు కొరుక్కుంటారు. సతీ సావిత్రి, సతీ అనసూయ, మహాసాధ్వి సీత అంటూ పురాణాల్లోని స్త్రీ పాత్రలుచేసిన త్యాగాలను ఇన్‌జెక్ట్ చేశారు. ఇటువంటి విషయాలను చిన్నతనంలోనే నరనరాల్లో ఎక్కిస్తున్నారు. ఈ విషయాలన్నీ ఆ అమ్మాయి వివులంగా చెప్పలేకపోవచ్చు. కానీ ఆమె అన్ని భాధలనూ ఓర్చుకోవటానికి కారణం ఇదే.

గృహ హింస అనేది మన రాష్ట్రంలోనే కాదు దేశమంతా వ్యాపించి ఉంది. అహ్మదాబాద్‌లోని గుజరాత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ రిసెర్చ్ అనే సంస్థ అభివృద్ధికి ఆటపట్టుగా ఉన్న ఖేడా జిల్లాలోని అయిదు గ్రామాలలో గృహ వేధింపుల మీద సర్వే చేసింది. ఈ సర్వేలో ప్రతి అయిదుగురు మహిళలలోనూ ఇద్దరు 'ఇంట్లో తరచూ దెబ్బలు తింటూనే ఉంటాం...' అని చెప్పారు. దెబ్బలు తినకపోయినా వేధింపులకు గురికావటం మామూలే అని ఐదింట ఒకరు చెప్పారు. వీరి దృష్టిలో వేధింపులంటే దుర్భాషలాడడం, శీలాన్ని తప్పు పడుతూ మాట్లాడడం మొదలైనవి. వాస్తవానికి దెబ్బల కన్నా ఇటువంటి వేధింపులే భరించలేనివి. దెబ్బ తగిలితే మహా అయితే ఒక రోజు బాధపడతారు. సూటిపోటి మాటలు పడ్డవారికి తెలుస్తుంది ఆ బాధ. అనుక్షణం పదేపదే గుర్తొస్తుంటే మరో పని చేయలేక, వంటో పని మీద ధ్యాసపెట్టలేక మానసిక క్షోభకు గురౌతారు. యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ సమర్పించిన నివేదికలో సైతం ఈ దురాగతం గుప్పుమందంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. దేశంలో ఆరు రాష్ట్రాలలో జరిపిన అధ్యయనం ఆధారంగా ఐక్యరాజ్య సమితి సంస్థ నివేదికను రూపొందించింది. ప్రశ్నించిన మహిళలలో 40 శాతం మంది తాము భర్తల చేతుల్లో తరచుగా హింసకు గురి అవుతూనే ఉన్నామని చెప్పినవారే. 'ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ విమెన్' అనే సంస్థ గత ఏడాది ఫిబ్రవరిలో దేశం మొత్తంమీద ఏడు జిల్లాలలో మరో అధ్యయనం జరిపింది. భోపాల్, ఢిల్లీ, చెన్నై, లక్నో, నాగపూర్, తిరువనంతపురం, వేలూర్‌లలో సర్వే చేసిన మహిళల్లో దాదాపు సగం మంది తమ భర్తల చేతుల్లో శారీరకంగా హింసకు గురవుతున్నట్లు చెప్పారు. గృహ హింస గురించి హైదరాబాద్‌లోని ఓ సబ్‌ఇన్‌స్పెక్టర్‌తో ప్రస్తావిస్తే, 'ఇటువంటి కేసులను

> నగర ప్రాంతాలలో 45 శాతం మహిళలు, పట్టణ ప్రాంతాలలో 49 శాతం మహిళలు తమ ఇళ్ళల్లో వేధింపులకు గురవుతున్నట్టు చెప్పారు.
>
> మురికి వాడల్లో నివసిస్తున్న కుటుంబాలలో 45 శాతం మహిళలు శారీరకంగా హింసను భరిస్తుండగా ఇతర ప్రాంతాలలో 35 శాతం మంది మహిళలు శారీరక హింసకు గురవుతున్నారు. బాగా చదువుకున్న వారి ఇళ్ళలో కూడా ఈ అనాగరిక ప్రవర్తన కనిపిస్తోంది. పూర్తి అక్షరాస్యను సాధించటమేకాక, మాతృస్వామ్య వ్యవస్థ కూడా అమలులో ఉన్న కేరళలో 30 శాతం మహిళలు తాము శరీరక హింసకు గురవుతున్నామని చెప్పారు. ఇలాంటి దుస్థితి తొలగడానికి రాష్ట్రపతి ముందుకెళ్ళిన బిల్లు ఆమోదం పొంది "గృహహింస" గడపదాటుతుందా!?

ప్రోత్సహించ వద్దని మా పై అధికారులు ఎప్పటి నుండో చెపుతున్నారు. అందుకే ఎవరైనా మొగుడు తన్నాడని వస్తే ఇక్కడే కౌన్సిలింగ్ చేసి పంపిస్తాం. అయినా భర్త అనేవాడు కొట్టకుండా ఎట్లా ఉంటాడు!. తెలుగు డిక్షనరీలోనే ఉంది భార్య అంటే భరించేది అని. భరించాలి... తప్పదు. మొగుడుపై కంప్లైంట్ చేస్తే, వాడ్ని మేము స్టేషన్‌కు తీసుకొస్తాం. దీంతో వాడికి సొసైటీలో పరువుపోతుంది. మరుసటి రోజు నుండి అవమాన భారంతో కుంగిపోడు. రెచ్చిపోతాడు. లేదా విడాకులిస్తాడు. ఆ తర్వాత నుండి ప్రతీవాడూ ఆమెను ఆశగా చూపులతోనే కొరుక్కుతింటాడు. అప్పుడామె ఎంతమంది మీద కంప్లైంట్ ఇస్తుంది? రేపు ఆమె కూతుళ్లకు పెళ్ళిళ్ళు అవుతాయా...? ఇలాంటి మాటలతో రేపటి నిజాన్ని కళ్ళముందే సెవెంటీ యంయం స్క్రీన్‌పై చూపిస్తాం..." అంటారు. అయితే ఈ బిల్లు పాసైతే మహిళలకెలా ఉన్నా తమకు మాత్రం తలనొప్పే అంటారు. అదే ఒక గైనకాలజిస్టును కలిస్తే ఎలా స్పందించారో చూడండి...

హింసా ప్రవృత్తి పేద మధ్య తరగతి వారికే పరిమితం కాలేదు. సంపన్న, మధ్య తరగతి కుటుంబాల నుండి కూడా తన వద్దకు శారీరకమైన గాయాలతో మహిళలు వస్తుంటారని సికింద్రాబాద్‌కు చెందిన గైనకాలజిస్ట్ డాక్టర్ శిరీష చెప్పారు. 'తాము ఎలా గాయపడిందీ వెల్లడించడానికి చాలా మంది మహిళలు ఇష్టపడరు. కానీ, వాళ్ళ శరీరంపై ఉన్న దెబ్బలు, గాయాలు చూసే ఎవరికైనా అర్థమవుతుంది. న్యాయం చేద్దామని రెట్టించి అడిగితే "ఇది మా సొంత విషయం..., కుటుంబ వ్యవహారం..." అంటున్నారు. మహిళల మీద జరుగుతున్న అమానుష హింసాకాండను చూసీ చూడకుండా వదిలేయాల్సి వస్తోంది. ఈ అవమానంషాన్ని ఆపాల్సిన బాధ్యత మన మీద ఉందని సమాజం ఏనాడూ భావించిన పాపాన పోలేదు. అత్తింటి వాళ్ళు కూడా కోడల్ని పరాయి వ్యక్తిగా చూస్తున్నారు. ఆమెను తొక్కిపెట్టాలని వారు ఎంతగానో ప్రయత్నం చేస్తున్నారు...' అని చెప్పారు. మనిషి సేదతీరడానికి, రక్షణ పొందటానికి నిలయు మని భావించే కుటుంబమే భారతీయ మహిళ పాలిట విలయంగా మారడం దీనివల్లే జరుగుతోందా?. అందుకే కిరణ్‌బేడి గతంలో మాట్లాడుతూ '**స్త్రీలు నోరెత్తక పోవడం వల్లే కుటుంబ సమన్వయం గురించి మనం గొప్పగా చెప్పుకుం టున్నాం**' అని కుండబద్దలు కొట్టారు!.



నిజమైన మగాడు హింస జోలికి పోడు

తిట్లు శాపనార్థాలను సహించేది లేదు

జీరో టాలరెన్స్ ఫర్ డొమెస్టిక్ వయిలెన్స్ (ఆమ్నెస్టీ పోస్టర్)



గృహ హింస నుండి మహిళలను రక్షించే బిల్లు-2005 రాష్ట్రపతి ఆమోదానికి పోవటంతో దేశంలోని మహిళా సంఘాల్లో ఆనందం వెల్లువెత్తుతోంది. ఎందుకంటే ఎంతో కాలంగా వారు చేస్తున్న పోరాటం ఫలితమిది. ఇక అమానుషంగా ప్రవర్తించే భర్తలపై భార్య సివిల్ దావా వేసే అవకాశం బాధిత మహిళలకు లభించబోతోంది. ముందుగా ప్రాథమిక నేర సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్)ను సమర్పించడం ద్వారా మహిళలు గొడ్డళ్ల దాకా పోకుండా గోటితోనే సమస్యను పరిష్కరించుకునే అవకాశాన్ని ప్రతిపాదిత చట్టం కల్పిస్తోంది. 1999లో జాతీయ మహిళా కమిషన్, విమెన్ రైట్స్ ఇనిషియేటివ్‌లు రూపొందించిన రెండు వేర్వేరు

సెక్షన్ 498 'ఏ'

ప్రభుత్వం కూడా గృహ హింసనో పెద్ద సమస్యగా పరిగణించడం లేదు. గృహ హింస నేర చట్టం పరిధిలోకి వస్తుందని అర్థం చేసుకోవడానికి ఇంగిత జ్ఞానం చాలు. అయినప్పటికీ, ఇళ్ళలోని ఈ వేధింపులను ప్రత్యేకంగా గుర్తించి న్యాయ పరంగా దానికొక ఉపశమన మార్గాన్ని కల్పించే ప్రయత్నం 1983లో మాత్రమే జరిగింది. వివాహితల మీద జరిగే హింసా కాండను శిక్షార్హమైన నేరంగా ప్రత్యేకంగా గుర్తిస్తూ భారతీయ శిక్షా స్మృతి (ఐపిసి)లో సెక్షన్ 498 'ఏ' ను ప్రవేశపెట్టారు. అయితే, న్యాయపరంగా అన్వయించి నప్పుడు దానిని వరకట్నం కోసం చేసే వత్తిడితో ముడిపెట్టి దాని పరిధిని పరిమితం చేశారు. వివాహిత మహిళలను వేధించేందుకు డబ్బు తెమ్మంటూ చేసే ఈ వత్తిడే కాక ఇతరత్రా సవాలక్ష విషయా లున్నాయి. వాటినన్నింటికీ విస్మరించటం ఓ పెద్ద లోపం. అదీకాక నిస్సహాయ మహిళలు క్రిమినల్ కేసుల విచా రణలో చాల ఆటుపోట్లను ఉదుర్కోవలసి ఉంటుంది. సమస్య అంతుతేల్చే దాకా పోరాడే పటిమను ప్రదర్శించగలిగే మహిళలు చాలా తక్కువ మంది కనిపిస్తారు. తెగువను ప్రదర్శించటానికి మరి కొంత మంది సిద్ధంగా ఉన్నప్పటికీ తగిన ఆర్థిక స్తోమత కూడా జత కానిదే వారికి ఉపయోగం లేదు. ఇంటి నుంచి భర్త పూర్తిగా గెంటేస్తాడేమోననే భయం కూడా వారి తెగింపును నీరుగారుస్తూ ఉంటుంది. ✤

ఎత్రాలతో, ఈ బిల్లుకు సంబంధించిన ప్రయత్నాలకు బీజం పడింది. మానవ వనరుల అభివృద్ధి శాఖలో భాగంగా ఉన్న మహిళా, శిశు అభివృద్ధి విభాగం ఈ రెండు సంస్థలు లేవనెత్తిన సమస్యలనూ సమన్వయం చేసి, దానిపై వివిధ మంత్రిత్వ శాఖల అభిప్రాయాలను సేకరించే పనికి శ్రీకారం చుట్టింది. దీనికి అర్జున్‌సింగ్ ఛైర్ పర్సన్‌గా వ్యవహరించారు. అయితే బిల్లులో రెండు లోపాలున్నాయని, వాటిని సరిచేయాలని సిపియం పోలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకరత్ సూచించారు. అయితే ఈ బిల్లు మీద కొందరు ధ్వజమెత్తిన తీరు ఆశ్చర్యం కలిగిస్తోంది. 'ఇదంతా దేశంలో అమలులో ఉన్న కుటుంబ స్ఫూర్తికి విరుద్ధంగా పరిణమించింది' అని అంటున్నారు. సర్దుకుపోవడానికి భార్య సుముఖంగా లేనప్పుడు, తిరస్కరించి నప్పుడు మాత్రమే సమన్వయ లోపం తలెత్తుతుంది. అలాగే భార్య తల్లిదండ్రులు అనవసరంగా కలుగ జేసుకోవడం కూడా అటువంటి సమస్యను రేకెత్తిస్తాయి. అత్తింటివారిని క్షోభపెట్టడానికి ఇప్పటికే మహిళలు చాలా మంది ప్రస్తుత చట్టాలను దుర్వినియోగం చేస్తున్నారు. ఇక కొత్త చట్టాలు చేయడం సమాజానికి ఆత్మహత్యా సదృశ్యమే అని వ్యాఖ్యానించినవారూ లేకపోలేదు. మహిళా సంఘాలు మాత్రం ఇటువంటి వాదాలను వట్టి చెత్తకింద కొట్టివేస్తున్నాయి. ఎంతోమంది మహిళలు బాధను మౌనంగా భరిస్తారనీ, అన్ని పంచాయతీలు ముగిశాక, ఎప్పుడో కానీ కోర్టు గుమ్మం తొక్కరని మహిళా సంఘాలు గుర్తు చేశాయి.

రచ్చకెక్కి సమస్యను సర్దుబాటు చేసుకున్న తర్వాత కూడా మహిళలు మళ్ళీ మరింత హింసను ఎదుర్కోవడం జరుగుతోంది. ఇటువంటి దారుణ పరిణామాలను తెగతెంచుకోడానికి కొత్తచట్టం ఉపకరిస్తుందని ఈ బిల్లు రూపకల్పనలో చురుకైన పాత్ర పోషించిన ప్రముఖ న్యాయవాది ఇందిరా జైసింగ్ చెప్పారు. ఫిర్యాదు దాఖలు కావడంతోనే కోర్టు నుంచి తగిన ఆంక్షలు వెలువడతాయి. ఇది కుటుంబ సభ్యులను జైలు పాలు చేయకుండా హింసాకాండను నిలువరించటానికి ముందు హెచ్చరికగా ఉపకరిస్తుంది' అని ఆమె వివరించారు.

1961లోనే వరకట్న నిషేధ చట్టం అమల్లోకి వచ్చింది. అంటే దాదాపు 45 సంవత్సరాలు కావస్తోంది. ఈ రోజుకూ అత్తింటి ఆరళ్ళకు అమాయక మహిళలు బలైపోతూనేఉన్నారు. కనీసం ఆ ఆత్మహత్యల సంఖ్యను తగ్గించే ప్రయత్నమూ జరగలేదు. ఈ క్రమంలో గృహ హింస నుండి మహిళలను రక్షించే బిల్లు ఎంత వరకు పనిచేస్తుంది? అని ప్రశ్నించేకన్నా, ఎలా చేస్తే బాగుంటుందనే దిశలో ఆలోచిస్తే బాగుంటుంది. ఆకాశంలో సగం మేము అనేకన్నా, 'ఫిఫ్టీ-ఫిఫ్టీ...' అని గర్వంగా చెప్పుకునే రోజుకోసం ఎదురు చూద్దాం... ✤

స్త్రీలపై హింస - గణాంకాలు

కేటగిరి	1996	1997	1998	1999	2000	2001	2002	2003	2004
వరకట్న హత్యలు	70	81	80	105	84	96	95	107	111
వరకట్న చావులు	390	464	458	420	450	397	413	450	488
ఆత్మహత్యకు ప్రేరేపించటం	741	856	844	920	1007	932	935	921	956
వేధింపులు	3367	3539	4181	4441	5107	4681	5280	6415	7024
హత్యలు	566	603	657	599	572	563	545	611	630
మానభంగాలు	769	872	810	855	893	814	952	901	898
కిడ్ అండ్ అబ్‌డక్షన్	667	782	725	812	753	573	733	746	887
అవమానపరచటం	2665	2681	2731	2952	3147	3015	3371	3695	3504
బహుభార్యత్వం	438	507	485	661	606	394	395	388	363

ఈ చట్టం మహిళలకు రక్షరేఖ...

హ్యూమన్ రైట్స్ లా నెట్‌వర్క్ కన్వీనర్ యమ్ ఏ వనజ ముఖంలో హర్షాతిరేఖలు కనిపించాయి. ఇది మహిళా సంఘాల విజయంగా చెప్పుకొచ్చారు. కొత్త చట్టం గురించి ఆమె మాటల్లోనే విందాం... "అక్రమ సంతానానికి కోర్టులో మెయిన్‌టెనెన్స్ ఇస్తున్నారుకానీ, అక్రమ సంబంధమని తెలియక మోసపోయిన మహిళలకు కోర్టులో ఎటువంటి న్యాయం జరిగేది కాదు. ఈ కొత్త చట్టం వస్తే అటువంటి అభాగ్యులకు కొంత ఊరట కలుగుతుంది. అంతేకాదు కొత్త చట్టం ద్వారా కోర్టు నుంచి ఇంజంక్షన్ కోరడానికి బాధితురాలికి అవకాశం కల్పిస్తుంది. హింసిస్తున్న భర్తకు అది గట్టి హెచ్చరికగా కూడా పనిచేస్తుంది. మహిళకు రెసిడెన్సీ రైట్ ఉంది. అంటే అత్తవారింట్లో అన్యాయం జరిగినా, భర్త మరణించాక ఆమెకు ఆ ఇంట్లో ఎటువంటి హక్కు ఉండదు. అందుకే పుట్టింటికి చేరుకుంటుంది. ఇప్పుడు అత్తవారింటి వారు కొట్టి తరిమేయకుండా న్యాయ స్థానం నుంచి ఆమె రక్షణ కోరవచ్చు. విచారణ జరుగుతున్న కాలంలో తన ఖర్చుల కోసం ఆమె న్యాయస్థానం నుంచి అత్యవసర ధన సహాయాన్ని కూడా కోరవచ్చు. నేరానికి పాల్పడిన వారిమీద సివిల్ దావా వేసే అవకాశం ఐపిసి 498 'ఏ' సెక్షన్ కింద లేకపోవడంతో చాలా మంది మౌనంగా బాధలు భరిస్తున్నారు. ఇప్పుడు అటువంటి అవకాశం వచ్చింది. ఈ చట్టం మహిళలకు రక్షరేఖ..." అంటారు.

ఈ మధ్య గృహ హింస మరీ పెరిగింది

పదేళ్ళుగా హైదరాబాద్ సిటీలో కౌన్సిలింగ్ నిర్వహిస్తోంది అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా). గృహ హింసకు వెనకున్న పాత్రధారులను పరిచయం చేశారు కౌన్సిలింగ్‌లో ప్రధాన భూమిక పోషిస్తున్న ఐద్వా సిటి ప్రసిడెంట్ గౌరి!. విచిత్రంగా ఉందికదూ. ఆమె మాటల్లోనే వినండి... "ప్రపంచం అరచేతిలో ఇమిడిన తర్వాత చాలా మందికి ఉద్యోగాలు పోయాయి. ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు దారులు మూసుకుపోయాయి. ఇటువంటి తరణంలో పెళ్లి, భార్య వాళ్ళకొక అక్షయపాత్ర, కామధేనువు, కల్పవృక్షంలా కనిపించాయి. ఈజీ మనీ కోసం భార్యను టార్గెట్ చేస్తున్నారు. అందుకే గృహ హింస పెచ్చుమీరి పోయింది. వాస్తవంగా భర్త పాత్రలో క్రౌర్యం ప్రదర్శించిన వ్యక్తి, తండ్రి పాత్రలో అంత సౌమ్యం ప్రదర్శించగలడా? లేదు. కాకపోతే ఏళ్ళ తరబడి తన చేతిలో కీలుబొమ్మగా మారిన భార్యను గయ్యాళి అత్తగా తెరకెక్కిస్తున్నాడు. దీనికి ఆజ్యం పోస్తున్నాయి టీవీ సీరియల్స్. గృహ హింసకు ప్రధాన సూత్రదారి పురుషుడు. వాళ్ళ ఆలోచనా ధోరణిలో మార్పురావాలి. ఆ దృక్పథం మారనంత కాలం ఇటువంటి చట్టాలు వాళ్ళకు కళ్ళేలుగా మారతాయి....' అంటారు. గృహ హింస గ్రామీణ ప్రాంతాలలో మరింత తీవ్రంగా ఉంది. ✤

కృషితో నాస్తి దుర్భిక్షం

పారుపల్లి వెంకటేశ్వరరావు

"అబ్బాయ్! నీకేదో ఉత్తరం వచ్చిందిరా" అని అరవింద్ పొలం నుంచి రాగానే తల్లి ఇంద్రాంబ ఓ కవరు అందించింది.

"యెవురన్నా అమ్మాయి రాసిందేవో అక్కయ్యా..." అన్నాడు ఆ యింటి పాలేరు రామన్న చిరునవ్వుతో.

"వాడికిష్టమైన అమ్మాయి రాస్తే నాకేం అభ్యంతరం లేదురా రామన్నా"

"అమ్మకీ నాకు కలహం పెట్టాలని చూస్తున్నావా రామన్న మామా! అమ్మ దగ్గర నీ పప్పులేం ఉడకవు." అన్నాడు అరవింద్ నవ్వుతూ

అరవింద్‌వాళ్ళు పోయిన దగ్గర నుంచీ రామన్న మగదిక్కుగా నిలిచాడు. అందుకే అరవింద్ సొంత మేనమామలా చూసుకున్నాడు.

"రామన్నా, నేను కట్నకానుకలకు ఆశపడనురా! వాడికి నచ్చినమ్మాయిని తెచ్చుకుంటే ఆశీర్వదిస్తాను. వాడిష్టమే నాయిష్టం"

"యిన్నావా అరవింద్ బాబూ! మీ అమ్మ మనసెంత మంచిదో! ఇగజూసుకో సక్కని సుక్కని. అపరంజి బొమ్మలాగుండాల!"

అరవింద్ కవరు చించి చదివాడు. అది ఇంగ్లీషులో ఉంది.

"అమ్మా! నా మిత్రుడు శ్రీ రామ్ ఇక్రిసాట్ నుంచి రాశాడు. అక్కడ అన్ని రకాల పంటలమీదా పరిశోధన చేస్తారు. అది హైదరాబాద్‌లో ఉంది. నేనక్కడికెళ్ళి కొత్త రకం పంటల గురించి, విత్తనాల గురించి తెలుసుకొనొస్తాను"

"సరే వెళ్లిరా నాన్నా! నువ్వు తెలుసుకున్న విషయాలు మనకేగాక ఊరికీ ఉపయోగపడాలి. నువ్వు చదివింది వ్యవసాయ శాస్త్రమేగా, పుట్టి పెరిగిన పల్లె సీమని పాడిపంటలతో అపరస్వర్గసీమగా అభివృద్ధి చేసి, నీ చదువు సార్థకం చేసుకో!" అన్నది ఇంద్రాంబ.

అరవింద్ సద్గుణసంపన్నుడు. అతని తండ్రి రాఘవయ్య వ్యవసాయ రంగంలో నిపుణుడు. స్వయం కృషితో పదెకరాల నుంచి ముప్పై ఎకరాల రైతయ్యాడు. ధనికరైతుగా పేరొందాడు. దురదృష్ట వశాత్తూ పాముకాటుకు గురై మరణించాడు.

పుట్టుకతోనే చురుగ్గా ఉన్న అరవింద్‌ను భర్తకిష్టమైన వ్యవసాయశాస్త్రంలో చేర్పించింది ఇంద్రాంబ. బాపట్ల వ్యవసాయ కళాశాలలో చేరి రాష్ట్రంలో ప్రథముడిగా అగ్రికల్చరల్ బిఎస్సీ పాసయ్యాడు. ఉద్యోగం కోసం ఆరాటపడలేదు. ఉన్న పొలంలోనే ఆధునిక వ్యవసాయ పద్ధతులతో పంటలు పండించాడు. రైతులందరికీ ఆదర్శంగా నిలిచాడు. నూతన పద్ధతులను అవలంబించడంలో రైతులకు సహకరిస్తా, అధిక దిగుబడులు సాధించాడానికి మార్గదర్శకుడుగా నిలిచాడు.

సిరిపురంలో ఒక గ్రంధాలయం ఉంది. అరవింద్ తీరికసమయాల్లో అక్కడికెళ్లి ఉత్తమ సాహితీ గ్రంధాలు చదువుతాడు. వరుసకు పినతల్లి, అయిన గ్రంధాలయ అధికారిణి అయిన అరుంధతి ప్రోత్సాహంతో గ్రామీణ ఇతివృత్తంగల కథలు రాసి, పత్రికలకు పంపుతాడు. అభ్యుదయ భావాలు గల అరవింద్ రచనలు యువతకు సందేశాత్మకంగా

ఉంటాయి. అరుంధతి తమ్ముడు సహదేవ్ సిరిపురం గ్రామానికి ప్రెసిడెంటు. సత్సంకల్పం కలవాడు. బిఎ చదివాడు. యభైఎకరాల పొలం, వ్యవసాయం ఉన్న ధనికరైతు. 'ప్రతి చిన్న విషయానికీ ప్రభుత్వ సాయం ఆశించక, స్వయం కృషితో మన గ్రామానికి కావాల్సినవి సమకూర్చుకోవాలి!' అని గ్రామ ప్రజల్ని సమైక్యం చేశాడు. సిరిపురం గ్రామాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దాడు. "కృషితో నాస్తి దుర్భిక్షం" అని నిరూపించాడు. అరవింద్ ప్రతి విషయంలోనూ సహదేవ్‌కు తన వంతు సహాయ సహకారాలందించాడు.

❊ ❊ ❊

హైద్రాబాదు వెళ్లాలంటే సిరిపురం నుంచి విజయవాడ మీదుగా బస్సులో వెళ్లాలి. ఇక్రిసాట్ వ్యవసాయ క్షేత్రానికి రామన్ననూ తీసుకెళ్లాడు అరవింద్. దానికి రామన్న ఆనందంతో పొంగిపోయాడు. అక్కడ నాలుగురోజులుండి, కొత్తపంటల్ని పరిశీలించి, కొన్ని మేలురకం విత్తనాలు తీసుకొని విజయవాడకు చేరుకున్నారు. సిరిపురం వెళ్లే బస్సుకోసం ఎదురుచూస్తున్నారు. ఆ సమయంలో గుంటూరు నుంచి వచ్చిన బస్సులో ఒక యువతి దిగి సిరిపురం బస్సు పాయింటుకొచ్చింది.

ఆ అమ్మాయి, రామన్నని చూసి "రామన్న బాబాయ్, బాగున్నావా?" అని పలుకరించింది.

రామన్న పరీక్షగా చూసి, "అమ్మాయ్! నువ్వు భీమయ్య గారి సిన్న కూతురు చందనవి గదూ! అయిదేండ్లయింది నిన్ను చూసి అప్పుడు పరికిణీతో ఉంటివి. ఇప్పుడు చీరెకట్టులో జూస్తి. యెంటనే గుర్తుబట్టలేకపోయానమ్మా! "అరవింద్ బాబూ! ఈ అమ్మాయి మీ మేనమామకూతురే! మనూరే! మీకూ వాళ్లకీ మాటల్లేవు గనుక మీరిద్దరూ ఒకళ్లనొకళ్లు తెలవరులే! అదీగాక యీ అమ్మాయి సిన్నతనంనుంచీ మనూరులో లేదు. గుంటూరులో పినతల్లి దగ్గర బెరిగిందిలే! నువ్వేమో కాన్వెంటు, కాలేజీ సదువుల్లో వుండేవాడివాయె!" అని పరిచయం చేశాడు రామన్న.

చందన అరవింద్‌కి నమస్కారం చేసింది.

"అమ్మనీ, నాన్ననీ సూడాలని వస్తున్నావా చందనా?" అన్నాడు రామన్న

"అక్కడ నా చదువయిపోయింది బాబాయ్! ఇక గుంటూరు వెళ్లను! ఇక్కడే ఉంటా!"

"ఇక్కడే ఉంటావా? మీ పిన్ని నిన్ను పెంచుకుందిగా! పెండ్లివాళ్లే చెయ్యాలిగా?"

"పెండ్లి వాళ్లేం చెయ్యరులే బాబాయ్! వాళ్లదీ పేదకుంటుంబమే! ఎడ్లబండి బెట్టుకొని బాడిగదోలుకుని కుటుంబం గడుపుకుంటారు. మా పిన్నికిద్దరు మగపిల్లలు. ఆడపిల్లల్లేరని నన్ను తన దగ్గరుంచుకుంది. పిన్నికొడుకులకు చదువు అబ్బలేదు. స్కూలు, కాలేజీ అందుబాటులో ఉన్నాయి గనుక నేను బిఏ చదివాను. పాసయ్యాను"

"బాబాయ్ మా అమ్మ గద్దరి తనవల్ల మా కుటుంబాల మధ్య దూరం. మా నాన్న కూడా యేమీ అనలేని పరిస్థితిలో ఉన్నాడు. మా అమ్మ చేసే దుబారాకి మా ఇరవై ఎకరాల పొలం హరించుకుపోయి అయిదెకరాలయింది. నేను పెంపకం పోయాను. అక్కని రెండో సంబంధపాయనకిచ్చారు."

"అమ్మాయి జెప్పింది నిజమే బాబూ! పెద్దకూతురుకి కట్నం ఇచ్చి పెండ్లిజేసే స్థాయి లేక అలా చేశారు. పెండ్లికర్సులు గూడా ఆయనే బెట్టుకున్నడంట! మరి ఈ చందన పెండ్లి యెట్లా జేస్తారో! సదువుకున్న పిల్ల!"

"బాబాయ్ నేనిప్పుడే పెండ్లి చేసుకోను! నేను మొదట జీవితంలో స్థిరపడాలి. చిన్నతనం నుంచి నేను మా పినతల్లి మీద ఆధారపడి చదువుకోలేదు. ఏడో తరగతిలోనే ప్రైమరీ చదివే పిల్లలకు ప్రైవేటు చెప్పేదాన్ని. వచ్చిన డబ్బు

పుస్తకాలకు, ఫీజులకు వాడుకోనేదాన్ని. బిఏ పూర్తి అయ్యేంతవరకూ కింది క్లాసులకు ట్యూషన్లు చెబుతూ, నా ఖర్చులకు సంపాయించుకుంటూ చదివాను. ఇప్పుడు మా చిన్ని పిల్లలు పెద్దవాళ్లయ్యారు. ఇక గుంటూర్లో వుండడం కుదరదు. సిరిపురంలోనే ఉండి ప్రయివేటు స్కూలు పెట్టు కుంటాను. బిఇడి చేయాలనుంది. ముందు నాకాళ్ల మీద నేను నిలబడే స్థాయి సంపా దించు కోవాలి! నాకే కాదు ప్రతి యువతికీ అది ముఖ్యం. ఆత్మ విశ్వాసంతో, ధైర్యంతో అది సాధించాలి!" అన్నది చందన.



"చందనా! నీ ఆత్మవిశ్వాసం, ఆశయం, అభినందనీయం! పేదకుంటుంబంలో ఉంటూ, స్వయం కృషితో బిఏ వరకు చదివావు. నీ దీక్ష నేటి యువతకు స్ఫూర్తిదాయకం! మన సిరిపురం గ్రామ పంచయతీ ప్రెసిడెంటు సహదేవ్ మామయ్య, నేనూ నీకు సహకారం అందిస్తా! సహదేవ్ మామయ్య అభ్యుదయ భావాలు కలవారు" అన్నాడు అరవింద్.

'చందనా' అని తనను చనువుగా సంబోధించి అభినందించడం, సహకారమందిస్తామని అరవింద్ అనటం చందనకెంతో ఆనందం కలిగించింది. అలా మాట్లాడుకుంటూ ఉండగానే సిరపురం వెళ్లే బస్సు పాయింటులోకి వచ్చి ఆగింది. ముగ్గురూ బస్సెక్కి సీట్లో కూర్చున్నారు. అరవింద్ ముగ్గురికీ టిక్కెట్లు తీసుకున్నాడు. చందన డబ్బులివ్వబోయింది. అరవింద్ వారించాడు.

"అదేంటమ్మా! అబ్బాయి నీకు టిక్కెట్లు తీసుకుంటే నువ్వు డబ్బులివ్వబోతున్నావా? అరవింద్ నీకు అత్తకొడుకు!" అన్నాడు రామన్న చిరునవ్వుతో.

❀ ❀ ❀

భీమయ్యకు కండబలమే గానీ బుద్ధిబలం లేదు. బండచాకిరీ చేసి పొలాన్ని పండించగల సత్తా ఉన్నా, పేరమ్మ మాట జవదాటే ధైర్యం లేదు. ఇంట్లో పేరమ్మదే పెత్తనం. అందాల రాశి లలితను సీతయ్యకు రెండో సంబంధంగా ఇచ్చారు. సీతయ్యకు యాభై ఎకరాల పొలముంది. మొదటి భార్య చనిపోయింది. ఇద్దరు మగపిల్లలు ఒక కూతురు. నలభైఅయిదేండ్ల వయసుంటుంది. కారు నలుపు. అమ్మనోటికి జడిసి తాళి కట్టించుకుంది లలిత. రెండువైపులా పెండ్లి ఖర్చులు భరించి సీతయ్య అట్టహాసంగా రెండోపెళ్లి చేసుకున్నాడు. 'కాకి ముక్కుకి దొండపండు' అని చూసిన వారంతా వెక్కిరించారు. అవేమీ పట్టని పేరమ్మ 'నా కూతురు కలవారి కోడలయింది' అని గర్వంగా చెప్పుకుంది. అందం, చదువు ఉన్న చిన్నకూతురు చందనకీ అటువంటి సంభందం దొరక్కపోతుందా అన్న ధీమాతో పేరమ్మ ఉంది.

అయిదెకరాల పొలంలో వచ్చే ఆదాయంతో అప్పు తీరదు. వడ్డీ పెరిగిపోతోంది. పేరమ్మ అహంకారం, నోటిదురుసుతనంతో బంధువులంతా దూరమయ్యారు. చుట్టాల అండదండలూ సహకారం కోల్పోయిన పేరమ్మా భీమయ్య దంపతులకు అరవైఎకరాల ధనికరైతు, వడ్డీవ్యాపారి శేషయ్య ఒక్కడే ఆపద్బాంధవుడు. అవసరమైనప్పుడల్లా అధికవడ్డీకి అప్పిచ్చి, ఇచ్చిన దానికంటే రెట్టింపుకు ప్రామిసరీనోటు రాయించుకుంటాడు శేషయ్య. ఏడాదికోసారి అసలు, వడ్డీ కలిపి నోటు తిరగరాయించుకుంటాడు. అలా చక్రవడ్డీ రోజురోజుకీ పెరుగుతున్నా పేరమ్మకు చీమకుట్టినట్టయినా లేదు.

భీమయ్య తనకున్న అయిదెకరాల పొలంలో ఒక ఎకరం మిరపతోటేశాడు. అందులో నాలుగువేపులా బంతిచెట్లు నాటాడు. తోటకు నాలుగువేపులా విరబూసిన బంతి చెట్లు కనువిందుచేస్తున్నాయి. గుంటూరు నుంచి వచ్చిన చందన మరునాడే తోట చూడాలని వచ్చింది. ఆ తోట పక్కనే అరవింద్ పొలముంది. అందులోనూ మిరపతోట వుంది. ఆ సమయంలో అరవింద్ తల్లి ఇంద్రాంబ పాలేరు రామన్నతో తోటకొచ్చింది. పక్కతోటలో ఉన్న చందనని చూసి, రామన్నని పంపి తనదగ్గరికి పిలిపించుకుంది. పెద్దలతో మాటలు లేకపోయినా భీమయ్య పిల్లలిద్దరితో ఇంద్రాంబ మాట్లాడుతుంది. అయిదేండ్లనాడు పరికిణీతో అందంగా కనిపించిన చందన, ఇప్పుడు చీరెకట్టుతో, నవయవ్వన శోభతో మరింత అందంగా ఉంది. చందన అందం ఇంద్రాంబను ముగ్ధురాలిని చేసింది.

"చందనా! ఇక ఈ ఊళ్లోనే ఉంటావటగా! అరవింద్ చెప్పాడు. ప్రయివేటు స్కూలు పెట్టుకుంటానన్నావటగదా! పేరమ్మ అదిసాగనిస్తుందా! పెద్ద పిల్ల లలితలాగే నీకూ పెండ్లి బేరం పెట్టదా? ఏ వయసు మళ్లిన వాడికోయిచ్చి ఒక లక్ష పట్టదా!" అన్నది నవ్వుతూ.

"అది జరగనివ్వనులే అత్తయ్యా! అక్కయ్య అమాయకురాలు! నేనెలా ఒప్పుకోను!"

"ఒప్పుకోనంటే ఆ జగమొండి రాకాసి ఊరుకుంటదా? ఆ దళారి శేషయ్య తన అప్పులు రాబట్టుకోవడానికి ఏ రెండో సంబంధమో వెదకడూ? చందనా, అలాంటి పరిస్థితే వస్తే నువ్వు ధైర్యంగా నిలబడు! నీకు మేమూ ప్రెసిడెంటు సహదేవ్ అండగా ఉంటాం! నేనూ ఆయింటి ఆడపడుచునే!" అని ధైర్యం చెప్పింది ఇంద్రాంబ.

"లాభంలేని శెట్టి వరదకు పోతాడు" అన్నట్లు వడ్డీ వ్యాపారి శేషయ్య లాభసాటి మనిషే! భీమయ్య అప్పు అసలూ వడ్డీ కలిపి లక్షదాటింది. ఇంతకుముందు ఇలాగే అయిన అప్పు పెద్దమ్మాయి లలితని చేసుకున్న అల్లుడు తీర్చాడు. ఆ షరతు తోనే ఆ పెండ్లి శేషయ్య కుదిర్చాడు. ఈ అప్పునూ చిన్న కూతురు పెండ్లితో తీర్చే ఆలోచన పేరమ్మకి వుందని శేషయ్యకి తెలుసు! దానికి మార్గమూ శేషయ్యకి రంగయ్య రూపంలో దొరికింది. శేషయ్య మిత్రుడు రంగయ్య, మైలవరం ధనికుడు. అతని భార్య కేన్సరుతో మరణించింది. ఇద్దరు ఆడపిల్లలున్నారు. నలభై ఏళ్లుంటాయి. మనిషి నలుపు. దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాడు. ఇరవై ఎకరాల మామిడి తోట ఉంది. రైసుమిల్లు ఉంది. లారీ, కారు ఉన్నాయి. రంగయ్య, శేషయ్యలకు దూరపు బంధుత్వం ఉంది. శేషయ్య తన మిత్రుడు రంగయ్యకి చందన అందం, చదువు, భీమయ్య ఆర్థికపరిస్థితి, పేరమ్మ మనస్తత్వం గురించి ఎటువంటి దాపరికమూ లేకుండా చెప్పాడు. రంగయ్యకి డబ్బంటే లెక్కలేదు. శేషయ్య బాకీ తీర్చి, పెండ్లి ఖర్చులు రెండు వైపులా భరించి, చందనని చేసుకోవడానికి సిద్ధపడ్డాడు. శేషయ్యతో కలిసి కారులో సిరపురం రావడం, చందనని చూడడం, పేరమ్మా భీమయ్యలతో బేరమాడి పెండ్లి కుదుర్చుకోవడం అంతా క్షణాల్లో అయి పోయింది. తన ప్రమేయం లేకుండా జరిగిన పెండ్లి తతంగాన్ని చందన ఒప్పుకోలేదు. పేరమ్మ తన ఉగ్రరూపం చూపింది.

"కలిగిన ఇంటి సంబంధం కాదంటావా! కాళ్లూ చేతులూ కట్టి పెళ్లిపీటల మీద కూర్చోబెట్టి మెడలో తాళికట్టిస్తా! సదవేస్తే ఉన్న మతిపోయిందే నీకు" అని గర్జించింది.

పేరమ్మ బెదిరింపులకీ, ఒత్తిడికీ చందన చలించలేదు. ఈ విషయం తెలిసిన మేనత్త ఇంద్రాంబ, అరవింద్, సహదేవ్, చందనకు అండగా నిలిచారు. సహదేవ్ చందనని తనింటికి రప్పించుకున్నాడు. అరవింద్, ఇంద్రాంబ అక్కడికొచ్చారు. పేదకుటుంబంలో పుట్టినా, స్వయంకృషితో చదివి బిఏ పాసైన చందనని సహదేవ్ అభినందించాడు.

"అరవింద్‌తో పెండ్లి నీకు అంగీకారమేనా?" అని అడిగాడు.

ఊహించని ఆ ప్రశ్నకు చందన "బాబాయ్! అత్తయ్య, బావ ఇష్టపడితే అంతకన్నా నాకు కావాల్సిందేముంది? అది నేను ఊహించని అదృష్టం!" అన్నది.

తొలిచూపులోనే చందన అరవింద్ మనసునదోచింది. ఇంద్రాంబకూ చందన అందచందాలు, చదువూ సంస్కారం నచ్చింది. చందనను అరవింద్‌కి తగిన జోడుగా భావించింది.

"చందనా, నువ్వు నాకు కూతురిలాంటిదానివి. అరవింద్ ఇష్టం మీదనే నిన్ను అడిగాను. ఇంద్రాంబక్కయ్య కట్నాలకు ఆశపడదు. కోడలుగా నువ్వేకావాలని కోరుకుంటోంది. ఆ ఇద్దరి సమక్షంలో నిన్ను అడిగానుగదా! చదువు, సౌందర్యం, సౌజన్యం ఉన్న నీ వంటి అమ్మాయి దొరకడం అరవింద్‌కీ అదృష్టమేనని నేనంటాను. నువ్వు మేజరువి. నీ పెండ్లి నీ ఇష్ట ప్రకారమే జరుగుతుంది. విజయవాడనుంచి రిజిస్ట్రారును పిలిపిస్తాను. పంచాయతీ ఆఫీసులో రిజిస్టరు వివాహం చేసి మీ అమ్మకి, శేషయ్యకి చట్టబద్ధంగా బద్ధిచెబుతాను. మీ పెండ్లి ఇక ఎవరూ ఆపలేరు" అన్నాడు సహదేవ్.

❀ ❀ ❀

పంచాయతీ ఆఫీసు ముందు షామియానా వేసి వేదిక నిర్మించారు. విజయవాడ నుండి రిజిస్ట్రారు వచ్చాడు. సహదేవ్ ఆధ్వర్యంలో, ప్రజల సమక్షంలో చందన, అరవింద్‌ల పెండ్లి నిరాడంబరంగా జరిగింది. భీమయ్య మొదటిసారిగా పేరమ్మని వ్యతిరేకించి పెండ్లికొచ్చి సంతకంచేసి అక్షింతలేశాడు. అందరూ తనని వదిలేసి వెళ్లడంతో పేరమ్మకి దిక్కుతోచలేదు. ఆఖరిక్షణంలో పెండ్లికి వచ్చి, సహదేవ్‌కి క్షమాపణ చెప్పి, వధూవరులకు అక్షింతలు వేసింది. ఆలస్యంగా నైనా తన తప్పు తెలుసుకుని అందరిలో కలిసింది పేరమ్మ. ✦

ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో రచనలకు

ఆహ్వానం

జోక్స్, కార్టూన్లు

మీ క్లాస్‌రూమ్‌లో, పనిచేసే ఆఫీసుల్లో, మీరు పాల్గొన్న ఫంక్షన్లలో, రోజువారీ సంభాషణల్లో చోటుచేసుకున్న హాస్య సంఘటనలు, పేలిన జోక్స్ రాసి పంపండి. మీరు కార్టూన్‌లు కూడా గీయగలిగితే వాటినీ పంపండి.

వంటలూ-వంటకాలు



మీరు రకరకాల రుచుల్లో అనేక వంటల ప్రయోగాలు చేస్తుంటారు కదా! అలాంటి వంటకాల గురించి, ఫ్యాన్సీ వంటకాల గురించి రాసి పంపండి.

కథ

సమకాలీన సామాజిక కథావస్తువులతో కూడిన కథలు పంపవచ్చు. అయితే ప్రింట్‌లో ఒక పేజీకి మించరాదు. కథను ఎడిట్ చేసే, తగ్గించే అవకాశాన్ని , రచనకు చెందిన హామీని ఇవ్వాలి.

కాలేజీ కబుర్లు

యువతీయువకులు తమ కాలేజీ కాంపస్‌లో, క్లాస్‌రూమ్‌లో, మీ మీ స్నేహాల మధ్య మీ అనుభవాలను పాఠకులతో పంచుకోండి. క్లుప్తంగా, ఒక అరఠావుకి మించకుండా రాసి పంపండి.

చారిత్రక గ్రామాలు

మన దేశం తరతరాలుగా గ్రామీణ నేపథ్యం కలది. కొన్ని గ్రామాలకు ఎంతో చారిత్రక ప్రాధాన్యత ఉంది. అలాంటి గ్రామాలు గురించి అరఠావు మించని రచనలు, ఫొటోలు పంపండి. ప్రచురిస్తాం.

పంపవలసిన అడ్రస్సు:
ఎడిటర్,ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి(దినపత్రిక),
రోడ్ నెం.1,అశోక్‌నగర్,
హైదరాబాద్ – 500 020

-ఎడిటర్, ప్రజాశక్తి

పి.ఎం.సుందరరావు

ప్రథమ బహుమతి

సురేష్, రాంబాబు పదవ తరగతి చదువుతున్నారు. సురేష్‌కు క్లాసులో అందరికంటే ఎక్కువ మార్కులు వచ్చేవి. దీంతో అతను చాలా గర్వపడేవాడు. రాంబాబు మాత్రం మామూలు పాసు మార్కులు తెచ్చుకునేవాడు. ఎటువంటి గర్వం లేకుండా అందరితో కలివిడిగా వుండేవాడు.

సురేష్, రాంబాబు క్లాసు పుస్తకాలతోపాటు ఇతర పుస్తకాలను కూడా బాగా చదివేవారు. ఓ సారి స్కూల్లో క్విజ్ పోటీలు నిర్వహించారు. అందులో సురేష్, రాంబాబు పాల్గొన్నారు. వాళ్ల క్లాసులోంచి వారిద్దరే పాల్గొన్నారు.

ఆ పోటీలో సురేష్ ప్రథమ బహుమతి సాధించాడు. అప్పటి నుండి అతనిలో గర్వం ఇంకా పెరిగింది. "ఆ రాంబాబుకి నాతో పోటీయా? ఇప్పుడే కాదు ముందు ముందు ఏ పోటీలోనూ అతను గెలవలేడు" అని మిత్రులకు చెప్పసాగాడు.

ఈ విషయం తెలిసిన రాంబాబు నిరాశ చెందకుండా క్లాసు పుస్తకాలతో పాటు జనరల్‌నాలెడ్జ్ పుస్తకాలు కూడా ఎక్కువగా చదవసాగాడు. సురేష్ చదవడం తగ్గించాడు. పైగా తనను గురించి అందరికీ గొప్పలు చెప్పుకుంటూ తిరగడంతోటే సరిపోతోంది.

రిపబ్లిక్ డే సందర్భంగా ఆ స్కూలు పూర్వ విద్యార్థుల సంఘం వారు క్విజ్ పోటీ నిర్వహించారు. ఈ పోటీలో కూడా సురేష్, రాంబాబు క్లాసు నుండి పేర్లిచ్చారు. పోటీ జరిగే ముందు వరకూ "ఈ సారి కూడా నేనే ప్రథమ బహుమతి తీసుకుంటాను" అని అందరికీ గొప్పగా చెప్పుకున్నాడు సురేష్. కానీ ఆ రోజు క్విజ్ పోటీలో రాంబాబు ఎక్కువ మార్కులు పొంది ప్రథమ బహుమతి అందుకున్నాడు.

రాంబాబుకు అందరూ శుభాకాంక్షలు తెలిపారు. అభిమానంతో కౌగిలించుకున్నారు . ఇదెలా సాధ్యమైందని కొంతమంది మిత్రులు అతనిని అడిగారు. "నేను ఇదివరకు జరిగిన క్విజ్ పోటీల్లో ఓడిపోయాను. ఆ ఓటమి గురించి ఆలోచించి నిరాశపడలేదు. పైగా అపజయాన్నే మెట్టుగా భావించి ఎక్కువగా కష్టపడ్డాను. అందుకే విజయం సాధించాను" అని చెప్పాడు. అందరూ అభినందనపూర్వకంగా చూశారు.

అప్పటి నుండి సురేష్ తన గర్వాన్ని తగ్గించుకుని రాంబాబుతో స్నేహంగా మెలగసాగాడు. పైగా మరింత కష్టపడి అన్నిట్లోనూ ముందు నిలవడానికి ప్రయత్నించసాగాడు. అతనిలో వచ్చిన మార్పుకు టీచర్లేకాక, తోటి పిల్లలు కూడా సంతోషించారు.



హాయ్ నేస్తాలూ...
నేనర్రా! తాబేలుని. కింద బొమ్మలో వున్నాకదా. చూడలేదా! అమ్మయ్య ఇప్పటికైనా కనిపెట్టారు. సంతోషం. మరి విషయం ఏంటంటే... మేం ఈ మధ్యే ఇల్లు మారాం. అల్లదిగో ఆ కొండపైన. కానీ మధ్యలోనేమో గజిబిజి దారులున్నాయి. ప్లీజ్ మీరైనా కాస్త సాయం చెయ్యొచ్చుకదా.

కొండ ఎక్కేదెలా!

వీరి వీరి గుమ్మడిపండు...

వీరి పేరేమి?

హలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చినవారెవరో గుర్తుపట్టేశారా! ఈయన మంచి నటుడు. పేరు తెలిస్తే... ఇవాళే ఇప్పుడే... కార్డు తీసుకుని రాసి మాకు పంపండి. మా చిరునామా: వీరి వీరి గుమ్మడిపండు, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.

19.6.05 కు సరైన సమాధానం రాసినవారు

ఎ.సాధన, 8వ తరగతి, గాంధీనగర్, అనకాపల్లి. జె.అనుజ్ఞ, 5వ తరగతి, రామాలయం వీధి, బల్లెపల్లి, ఖమ్మం. జె.సాయిఅనుజ్ఞ, 5వ తరగతి, బల్లెపల్లి, పాండురంగాపురం, ఖమ్మం. కాలువ శ్రీఅనూహ్య, 7వ తరగతి, బ్రాడీపేట, గుంటూరు. రాళ్లబండి సౌందర్య, 8వ తరగతి, శ్రీరాంపూర్. నిశాంత్‌రాయ్, 5వ తరగతి, పొన్కల, ఆదిలాబాద్. జి.సాయిభరత్‌రెడ్డి, 7వ తరగతి, మోదుకూరు, గుంటూరు. పి.జయశ్రీ, 8వ తరగతి, చిలుకలూరిపేట, గుంటూరు. యు.యు.బాబునరేంద్రప్రసాద్, 8వ తరగతి, యు.ఎన్.దేవిక, 10వ తరగతి, టి.తస్లీమా, జి.రేవతి, యు.దీప్తి, యు.నాగలక్ష్మి వి.శైలజ, సి.నందిత, యు.ఉషారాణి, యు.ఉమాదేవి, ఎస్.స్రవంతి, కె.షంషాద్, బి.సుధారాణి, ఎం.తాయిలక్ష్మి ఎన్.శ్రీలేఖ, బి.గౌతమి, కె.సులోచన, సి.నాగరత్న, ఒ.సుమలత, పి.విజయమాధవి, డి.రిహానాభాను, ఆర్.పి.రంజాన్, ఎం.షబ్బీర్ హుస్సేన్, బి.రవితేజయాదవ్, యు.ఈరన్న, కె.విజయకుమార్, జి.విజయప్రకాశ్, 10వ తరగతి, కె.ప్రకాశ్‌కుమార్, పి.హరిప్రసాద్, 9వ తరగతి, కె.బిందు, 8వ తరగతి, ఎం.మాధురీ మణిమాల, 8వ తరగతి, ఎం.ప్రవీణ్‌కుమార్, 8వ తరగతి, ఎం.నయన, 8వ తరగతి, యు.ఎం.డి.నాసిర్, 10వ తరగతి, బి.శ్రీనివాసులు, టి.ఎం.డి.నాసిర్, యు.భీమలింగ, బి.రవి, ఎం.అమరేష్, యు.ఎం.అనిల్, యు.రాజశేఖర్, ఎం.రమేష్, యు.ఎస్.అనిల్, కె.మాలిక్ భాష, ఎం.తిమ్మప్ప, కె.మజార్‌హుస్సేన్, ఎం.అనుదీప్, జి.నాగేష్, జి.సునందపవన్, 10వ తరగతి, శ్రీవేణు విద్యాలయం, లక్ష్మీపేట, ఎమ్మిగనూరు.

❄

26.6.05 సమాధానం
ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

పురుషులు ఎందరు?

అదో క్లాసు. క్విజ్ పోటీ జరుగుతోంది. పిల్లలంతా మాష్టారు ఏం ప్రశ్న వేస్తారా? అని ఎంతో ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. ఇంతలో ఆయన అడగనే అడిగేశారు. అదేంటంటే... '2002 సంవత్సరంలో ఎంతమంది పురుషులు జన్మించారు?' అని. దానికి క్లాసులోని పిల్లలంతా విపరీతంగా ఆలోచించడం మొదలెట్టారు. కానీ ఓ పిడుగు లేచి చెప్పిన జవాబుతో మాష్టారితో సహా అంతా నోరు తెరిచారు. ఇంతకీ ఆ పిల్లాడు ఏం చెప్పి వుంటాడు?

బయట పడడం ఎలా?



ఆ దొంగ జైల్లో వున్నాడు. అతనున్న గదికి ఒకే ఒక్క ద్వారం వుంది. దానికున్న ఇనుప తలుపుకు బయట తాళం వేసి సీలు వేశారు. గది గోడకు మాత్రం తొమ్మిదడుగుల ఎత్తులో ... చిన్న కిటికీ వుంది. అక్కడినుంచే బైటపడే అవకాశం వుంది. కానీ అతని దగ్గర ఒక్క బాకు మాత్రమే వుంది. దాంతో అతను ఎలా బయట పడగలడు?

(జవాబుల్లో చూడండి)

చిన్నారి చిత్రకారులు



అల్వాల రణధీర్,
7వ తరగతి,
మరిపెడ,
వరంగల్.

మీరూ వేస్తారా!

ఈ వారం చిన్నారి చిత్రకారులు వేసిన బొమ్మ భలేగా వున్నాయికదూ. మీరూ ఇంతకంటే బాగా వెయ్యగలరా! మరైతే ఆలస్యం ఎందుకు? తెల్లటి కాగితంమీద బొమ్మ వేసి మాకు పంపండి. ప్రచురిస్తాం. మా చిరునామా: చిన్నారి చిత్రకారులు, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.

వి'చిత్రం'

హేయ్ం! విచిత్రం చూసి చాన్నాళ్లైంది కదూ. అందుకే ఈ వారం మీకోసం ఈ బొమ్మను తీసుకొచ్చాం. అందులో మీకు ఏం కనిపిస్తోందో చెప్పండి. య్యస్. మీరు చెప్పింది కరెక్టే. అందులో గంటలు కట్టుకున్న గుర్రం వుంది. కానీ ఇంకా ఏదో వుందంటున్నారు ఆర్టిస్ట అంకుల్. మీకేమైనా కనిపిస్తోందా! అర్రే... జవాబు చూడండి.

జవాబు

బుజ్జాయిలూ... అల్లరిలోనే కాదర్రా! అన్నిట్లోనూ ముందుండాలి. ఈ బొమ్మను తిరగేసి చూడండి. ఒక మీసాల అంకుల్ కనిపిస్తాడు. కనిపించాడా!

బుడుగులూ... కింద నాలుగు కుక్కపిల్లలున్నాయికదా. అవి నాలుగూ నాలుగు రకాలుగా నిలబడ్డాయి. వాటి నీడలు కూడా పక్కనే వున్నాయి. కాకపోతే గజిబిజిగా వున్నాయి. ఏ కుక్కపిల్ల నీడ ఏదో కనిపెట్టండి చూద్దాం.

ఎవరి నీడ ఏది?





ఎస్‌కె. దుర్గాసాహెబ్,
7వ తరగతి,
రాగూర్ విద్యాలయం, పల్లిపాడు, ఖమ్మం.

మీకు తెలిసిన జనరల్ ఎవరో!

హేయ్ం! పెద్దవాళ్లకు జనరల్ ముషరఫ్ తెలుసుకదా. కానీ పిల్లలందరికీ తెలిసిన జనరల్ ఒకరున్నారు. వారెవరైవుంటారబ్బా...!

జవాబులు

పురుషులు ఎందరు?

2002లో పురుషులే పుట్టలేదు. ఎలాగంటే... అందరూ చిన్నారులుగానే పుడతారు కాబట్టి.

బయట పడడం ఎలా?

దొంగ బయటపడడానికి ఓ ఉపాయం వుంది. అతను తన దగ్గర వున్న బాకుతో కింద నేలను తవ్వాలి. ఎంత వరకంటే... నేల తవ్వగా వచ్చిన మట్టి తొమ్మిదడుగుల ఎత్తులో వున్న కిటికీని చేరే వరకూ. ఆ తర్వాత ఆ మట్టి మీద నుంచి దొంగ బయటపడొచ్చు.

మీకు తెలిసిన జనరల్

ఏంటి? మీ అందరికీ తెలిసిన జనరల్ అనేసరికి విపరీతంగా ఆలోచిస్తున్నట్టున్నారే! అదేనర్రా! జనరల్ నాలెడ్జ్‌లో వుండే జనరల్.

పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ

అంబులెన్స్ డ్రైవర్

అంబులెన్సు స్పీడుగా వెళుతోంది.

కలకత్తాలో రోడ్లన్నీ వాహనాలతో కిక్కిరిసి ఉన్నాయి.

ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకుంటూ ముందు వెళుతున్న వాహనాలను దాటుకుంటూ గమ్యస్థానం చేరడానికి అంబులెన్సు పరుగులు తీస్తోంది.

పాత వాహనం... తెల్లరంగు వెలిసిపోయి ఉంది. ఇంజను అరిగిపోవడంతో గేర్లు మార్చినప్పుడు అదోలాంటి శబ్దం వస్తుంది.

అంబులెన్సు వాహనంలో వెనుక స్ట్రెచర్ ఉంది.

దానిపై కాళ్లు విరిగిపోయిన వ్యక్తి పడుకొని ఉన్నాడు. బాధతో విలవిల్లాడుతూ అతను అరుపులు రోడ్డుపైన వెళుతున్నవారికి వినిపిస్తున్నాయి. వెనుక భాగంలో కూర్చున్న ఇద్దరు నర్సులు ఒక వార్డు బాయి ఆ క్షతగాత్రుడ్ని సముదాయించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

అంబులెన్సు ముందుకు సాగిపోతూనే ఉంది.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి గురించి సమాచారం అందడం, ప్రమాదం నగర శివార్లలోనే జరగడంతో లేడీ డఫ్రిన్ ఆసుపత్రి నుంచి అంబులెన్సు అక్కడికి బయలుదేరింది. ఈ లోపు గాయపడిన వ్యక్తుల బంధువులకు కూడా ఫోన్ ద్వారా సమాచారం రావడంతో వారు కూడా ఆసుపత్రి వద్దకు చేరుకుని అంబులెన్సు కోసం ఆతృతతో ఎదురు చూస్తున్నారు.

పాతపడిన ఆ వాహనం ఎంత స్పీడు వెళ్లగలదో అంత స్పీడుగానూ నడపడంతో సకాలంలో ఆసుపత్రి చేరుకుంది.

అక్కడ క్షతగాత్రుడి భార్య, తల్లిదండ్రులు, సోదరులు పిల్లలు అందరూ ఏడుస్తూ చూస్తున్నారు. అంబులెన్సు రాగానే వారే ఆతృతగా వెనుక తలుపు వద్దకి చేరుకున్నారు. రక్తం కారుతున్న వ్యక్తిని చూసి గొల్లుమన్నారు.

స్ట్రెచర్‌పైన మోసుకుని రూంలోపలికి తీసుకువెళ్లారు.

డాక్టర్లు వెంటనే రంగంలోకి దిగారు.

కుటుంబ సభ్యులందరినీ బైటికి పంపించి వేశారు.

కట్లు కట్టి విరిగిన ఎముక అతకడానికి ఆపరేషన్ చేయడానికి వెంటవెంటనే ఏర్పాట్లు చేశారు.

గాయపడిన వ్యక్తి భార్య ఆసుపత్రి వరండాలో కుర్చీలో కూర్చుని వెక్కివెక్కి ఏడుస్తోంది. ఆమె చుట్టూ పిల్లలు చేరి ఉన్నారు. వారూ ఏడుస్తున్నారు. ఆమె పక్కన ఇద్దరు అమ్మాయిలు భర్త చెల్లెళ్లో, ఆమె చెల్లెళ్లో తెలియదు. ''మరేం వర్వాలేదు'' అని

సముదాయిస్తున్నారు.

వారిని చూసి ప్రతిమ మనసు అదోలా అయిపోయింది.

అంబులెన్సు ఆసుపత్రి మెయిన్‌గేటు పక్కన గోడవార నిలిపింది. దాని పక్కనే నిల్చుని బాధ పడుతున్న అమ్మాయిని చూస్తోంది. కన్నీరు మున్నీరు అవుతున్న ఆమెను ఓదార్చాలని అనుకుంది.

ఈలోపు లోపలి నుంచి డాక్టర్ వచ్చారు.

అతడిని అందరూ చుట్టు ముట్టారు.

"ప్రాణాపాయం లేదు. కాళ్ళకు కూడా ఇబ్బంది లేదు. అరగంట ఆలస్యం అయితే రక్తం గడ్డకట్టి మోకాలు వరకూ తొలగించవలసి వచ్చేది. మీరు అదృష్టవంతులు ప్రమాదం జరిగిన నిమిషాల్లోనే మా అంబులెన్సుకు సమాచారం అందడం, గాయపడిన వ్యక్తిని వెంటనే తీసుకురావడం జరిగింది!"

"థ్యాంక్స్ డాక్టర్! మా ఆయన ప్రాణాలను కాపాడారు. మీ మేలు మరిచిపోలేము" ఏడుస్తున్న నివేదిత డాక్టర్‌ను అభినందనలతో ముంచెత్తింది.

"మీరు థ్యాంక్స్ చెప్పవలసింది నాకు కాదమ్మా! మీ ఆయన్ని అంబులెన్సులో ఎక్కించుకుని స్పీడ్‌గా డ్రైవ్ చేసుకుని సకాలంలో ఆసుపత్రికి తీసుకువచ్చిన మా ఆసుపత్రి అంబులెన్సు డ్రైవర్ ప్రతిమా పాల్ చౌదరికి" డాక్టర్ చెబుతూ దూరంగా అంబులెన్సు వద్ద నిల్చున్న ప్రతిమను చూపించారు. మిగిలిన కుటుంబసభ్యులు ఆపరేషన్ గురించి కాలు విరిగిపోయిన గాయం గురించి డాక్టరును ప్రశ్నల వర్షం కురిపిస్తూ అడుగుతున్నారు. నివేదిత మాత్రం ఎవరినీ చూడటం లేదు. గబగబా ప్రతిమ వద్దకు వచ్చి "ఆమె చేతులు పట్టుకుని ఊపేసింది. "నాకు పతిభిక్ష పెట్టారు. మీ మేలు మరిచిపోలేను. అంబులెన్సు నడిపేవారు మగవాళ్లే ఉంటారని తెలుసు. స్త్రీగా నువ్వీ పని చేస్తున్నావని ఇప్పుడే తెలుసుకున్నాను. నా పసుపు కుంకుమలు చెరిగిపోకుండా నాభర్తను రక్షించావు" అంది.

నివేదిత మాటల్లో ఆర్తి, ఆవేదన, ఉద్రేకం ప్రతిమ మనసును కదిలించింది. "నేను ప్రత్యేకంగా చేసింది ఏమీ లేదు. నా విధిని నిర్వహించాను అంతే" అంది.

ప్రతిమ మాటలను వింటూ పాదుపడిన పెద్ద సైజు అంబులెన్సును తెల్లబట్టలు కట్టుకున్న ప్రతిమాచౌదరిని మార్చి మార్చి చూసింది. తర్వాత "మీరే ఈ అంబులెన్సును నడిపారా?" అని అడిగింది.

''అవును నేనే దీని డ్రైవర్‌ను. ఈ అంబులెన్సును పదహారేళ్లుగా నేనే నడుపుతున్నాను. ఈ దేశంలో తొలి మహిళా అంబులెన్సు డ్రైవర్‌ని కూడా నేనే!" అంది.

"మిమ్మల్ని మళ్లీ కలుస్తాను!" ప్రతిమ వద్ద సెలవు తీసుకుని ఆసుపత్రి వైపు కదిలింది నివేదిత.

❊ ❊ ❊

ప్రతిమాపాల్ చౌదరి కలకత్తాలో మధ్య తరగతి కుటుంబంలో పుట్టారు. తల్లి దండ్రులిద్దరూ పేదకుటుంబాల నుంచే రావడంతో ఆమె చదువు కూడా అంతంత మాత్రంగానే సాగింది.

1969లో స్కూల్ ఫైనల్

పరీక్ష పాసైన తర్వాత మరి పై చదువులు చదివించడానికి తల్లిదండ్రులకు స్థోమత లేకపోయింది. ఈ చిన్న చదువుతో ఉద్యోగం దొరకడం కష్టమని ఆమె టెలిఫోన్ ఆపరేటర్‌గా శిక్షణ పొందింది. టైపు రైటింగ్‌లో అన్ని రకాల పరీక్షలు పాసైంది. తన కాళ్లమీద తను నిలబడటానికి ఏదైనా ఉద్యోగం సంపాదించాలని ప్రయత్నించింది. ఫర్నిచర్ షాపులో టెలిఫోన్ ఆపరేటర్‌గా ఉద్యోగంలో చేరింది.

ప్రతిమ చదువుతున్న సమయంలోనే తండ్రి మామయ్యల సహకారంతో డ్రైవింగ్ నేర్చుకుంది. వాహనాలను నడపడం తెలిసినప్పటికీ ఎటువంటి సర్టిఫికెట్లు సంపాదించలేదు. ఆ సమయంలో టెలిఫోన్ ఆపరేటర్‌గా ఉన్నప్పుడు పత్రికలో వచ్చిన ప్రకటన ఆమెను ఆకర్షించింది. కలకత్తాలో ఒక ఆసుపత్రివారు తమ అంబులెన్సుకు డ్రైవర్ కావాలని ప్రకటించారు. ఎందుకో ఆ ప్రకటన ఆమెను అమితంగా ఆకర్షించింది. వెంటనే డ్రైవింగ్ లైసెన్సుకు దరఖాస్తు చేసుకుని లైసెన్సు పొంది ఆ ఉద్యోగానికి దరఖాస్తు చేసింది. ఒక స్త్రీ డ్రైవర్ ఉద్యోగం కోసం దరఖాస్తు చేయడం ఆసుపత్రిలో సిబ్బందికి ఆశ్చర్యాన్ని కలిగించింది. వారు నిర్వహించిన ఇంటర్వ్యూలో ప్రతిమకే అవకాశం లభించిది.

వెంటనే టెలిఫోన్ ఆపరేటర్ ఉద్యోగాన్ని వదులుకుని అంబులెన్సు డ్రైవర్‌గా ఉద్యోగంలో చేరింది. ఉద్యోగంలో ఉంటుండగానే నికుంజ్ చక్రవర్తితో వివాహం జరిగింది.

ఈ విధంగా ప్రతిమ పదహారు సంవత్సరాల పాటు అదే ఆసుపత్రిలో ఉద్యోగం చేసింది. తర్వాత లేడీ డఫ్రిన్ ఆసుపత్రిలో అవకాశం రావడంతో చేరి పోయింది.

మొదట్లో ప్రతిమ డ్రైవర్ ఉద్యోగం చేయడం పట్ల అత్తవారింట్లో విమర్శలు ఎదురయ్యాయి. తమ కోడలు అంబులెన్సు డ్రైవర్ కావడం వారికి ఎంతమాత్రం ఇష్టంగా ఉండేది కాదు. క్రమంగా ఆమె అత్తగారిని, మామగారిని ఒప్పించి ఆ వృత్తిలో కొనసాగింది.

భర్త నికుంజ్ చక్రవర్తి నుంచి ఎప్పుడూ ఎటువంటి ఇబ్బంది, అభ్యంతరం వ్యక్తం కాలేదు. స్త్రీ తన కాళ్లమీద తను నిలబడటానికి గౌరవప్రదమైన ఎటువంటి వృత్తిని అయినా చేయవచ్చునని అతను అభిప్రాయపడేవాడు.

ఆ విధంగా ప్రతిమ దేశంలోనే అంబులెన్సు డ్రైవరైన తొలి మహిళగా గుర్తింపు పొందారు.

❋ ❋ ❋

రాత్రి ఎనిమిది గంటలైంది.

గ్యాస్ స్టవ్‌పై పెట్టిన కుక్కరు రెండు విజిల్సు రావడంతో స్టవ్‌ను ఆపి ప్రతిమ వాలు కుర్చీలో కూర్చుంది.

ఎదురుగా టీవీలో వార్తలు వస్తున్నాయి.

వంట చేస్తూ టీవీ చూడటం ప్రతిమకు ఇష్టం. తలుపు చప్పుడు కావడంతో తలతిప్పి చూసింది.

"ఈ టైమప్పుడు వచ్చింది ఎవరా" అని నెమ్మదిగా లేచి తలుపుతీసింది.

ఎదురుగా నివేదిత.

ప్రతిమ ఆశ్చర్యపోతూ "మీరా? రండి. నా అడ్రసు ఎలా తెల్సింది. ఈ సమయంలో ఇలా రావడం" సంబంధంలేని మాటలతో లోపలికి ఆహ్వానించింది.

నివేదిత లోపలికి వచ్చి కుర్చీలో కూర్చుంది. చేతి సంచిని కుర్చీ పక్కన పెట్టింది.

"ఎలా ఉంది మీ వారికి?"

"పూర్తిగా తగ్గిపోయింది. నడవడానికి కాస్త ఇబ్బంది పడుతున్నారు. చాలా రోజులుగా మిమ్మల్ని కలుసుకోవాలని అనుకుంటున్నాను. అయినా కుదరలేదు. ఆ రోజు మీ చొరవే మా వారిని కాపాడింది!"

"అబ్బే అదేం లేదు. నా విధి నిర్వహణ నేను చేశాను"

ఆ తర్వాత ప్రతిమ లోపలికి వెళ్లి బత్తాయి పళ్ల జ్యూస్ తీసి నివేదితకు అందించింది. "అబ్బే ఎందుకండీ!" అంటూ మొగమాటంగా అందుకుంది.

"మీ గురించి తర్వాత తెలుసుకున్నాను. ఎంతో కృషితో, పట్టుదలతో డ్రైవర్‌గా విజయాలు సాధించారట కదా? అంది.

"మొదట్లో నేను అంబులెన్సు నడుపుతూ రోడ్డుపైన వెళుతుంటే నడిచివెళ్లేవారంతా ఆగి మరీ విచిత్రంగా చూసేవారు. మొదట్లో వారు అలా చూడటం ఇబ్బందిగా ఉండేది. తర్వాత అలవాటు అయిపోయింది."

"మీ మీద అందరికీ నమ్మకం ఉండేదా?"

"నేను పనిచేసే ఆసుపత్రి అధికారులకు ఎంతో నమ్మకం. కాని రోగులు, వారి బంధువులు మాత్రం నన్ను శంకించేవారు. నేను అంబులెన్సు నడిపితే ప్రమాదాలు జరుగుతాయని భయపడేవారు. కానీ క్రమంగా వారికి నా సమర్థత అర్థం అయింది!" ప్రతిమ వివరించింది.

"ఈ వృత్తిలో నాకు ఎంతో సంతృప్తి కలుగుతోంది. ఎవరూ సాధించలేని విషయాలను నేను సాధించాను. ఎంతో మంది ప్రేమాభిమానాలను పొందాను. ఆలిండియా స్టేటు గవర్నమెంటు మోటారు ఎంప్లాయిస్ ఫెడరేషను, పశ్చిమబెంగాల్ డ్రైవర్ అండ్ మెకానికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌లకు వైస్ ప్రెసిడెంటుగా వ్యవహరిస్తున్నాను. ఈ పనులతో నిత్యం బిజీగా ఉంటాను" మళ్లీ ఆమే వివరించింది.

నివేదిత ఈ విషయాలు వింటూ టీవీ చూస్తూ ఎన్నో విషయాలను అడిగి తెలుసుకుంది. "నిజంగా మీరు ఎంతో అదృష్టవంతులు. ఈ వృత్తిలో బాధపడిన సందర్భం ఉందా?" అంటూ సంచిలోంచి ఒక చీర, స్వీటు ప్యాకెట్‌ను బైటికి తీసి టీపాయ్‌లపై పెట్టింది.

వాటిని చూడగానే ప్రతిమ మొహం మ్లానమైపోయింది.

నివేదితను, ఆ వస్తువులను చూస్తూ ఉండిపోయింది.

ఆమె కళ్లల్లో నీరు గిర్రున తిరిగింది. అవి బొటబొట కారే ప్రయత్నం చేస్తుండగా లోపలికి వెళ్లి మొహం కడుక్కుని వచ్చి కూర్చుంది.

"ఆ రోజు అంబులెన్సు కావాలని ఫోన్ వచ్చింది. ఆసుపత్రి నుంచి హడావుడిగా బయలు దేరాను. ఆ ప్రాంతానికి వెళ్లిన తర్వాత వార్డుబోయిలు శవాన్ని పికప్ చేసుకున్నారు. ఆసుపత్రికి తీసుకువచ్చి అప్పగించినప్పుడు తెల్సింది. అది నా భర్త నికుంజ్ చక్రవర్తిది. అంతకన్నా విషాదం ఉంటుందా? నాకు తెలియకుండా నా భర్త శవాన్ని తీసుకురావడం, వచ్చేంతవరకూ నా వెనుక ఉన్న పార్థివ శరీరం నా భర్తదని తెలుసుకోలేకపోవడం. ఈ విషాదం నుంచి కోలుకోవడానికి చాలాకాలం పట్టింది. రాత్రి పూట ఒంటరిగా కూర్చున్నప్పుడు ఆయన గుర్తుకు వస్తుంటారు. ఆయన ఇప్పుడు లేరు. కానీ నికుంజ్ చక్రవర్తి జ్ఞాపకాలు నా చుట్టూ ఉన్నాయి. విషాదాన్ని మరిచిపోవడానికి సంగీతాన్ని వింటుంటాను. నాకు నచ్చిన పుస్తకాలను తెచ్చుకుని కళ్లు మూతలు పడేంతవరకూ చదువుతుంటాను. పాతికేళ్లుగా ఈ రంగంలో ఉన్న ఏకైక మహిళగా నాకు ఎటువంటి పురస్కారాలు కూడా లభించలేదు. ప్రాణాపాయంలో ఉన్న రోగుల్ని ఆసుపత్రికి తీసుకువెళుతూ ఒంటరితనాన్ని అధిగమించే ప్రయత్నం చేస్తున్నాను. ఆమె ఒకొక్కమాట అతి కష్టంపైన పలికింది. టీవీ వైపు చూస్తూ, భారంగా తిరుగుతున్న పై కప్పు ఫ్యాను రెక్కల వైపు చూస్తూ చెప్పవలసిన విషయమంతా వివరించింది.

ప్రతిమా చౌదరి మాటలు వింటున్న కొద్దీ నివేదిత కళ్లల్లో నీళ్లు తిరిగాయి. "అంబులెన్స్ డ్రైవర్ జీవితంలో ఇంతటి విషాదం వుందా?" మనసు బాధగా మూలిగింది.

నా మీద అభిమానంతోనో, కృతజ్ఞతతోనో మీరీ వస్తువులు తెచ్చారు. మీరు తెచ్చిన స్వీట్లు షుగర్ వల్ల నేను తినలేను. చీర జాకెట్టు మీరిస్తే నేను తీసుకోలేను. తీసుకుంటే నేను అధికంగా ప్రేమించే నా భర్తను అవమానించినట్లే. దయచేసి ఏమీ అనుకోకండి. మీరు తెచ్చినవి తీసుకోకపోయినా మీరెప్పుడూ నా స్నేహితులే. ఎప్పుడైనా రావచ్చు. కష్టసుఖాలు మాట్లాడుకోవచ్చు'' ప్రతిమ మరి చెప్పలేకపోయింది.

ఆమె కళ్లు మళ్లీ వర్షించడం మొదలు పెట్టాయి.

నివేదిత మౌనంగా లేచింది.

తెచ్చిన చీర, స్వీట్లు ఇతర వస్తువులను తిరిగి తన సంచిలో సర్దుకుంది. "వస్తాను అక్కా!" అంటూ ముందుకు కదిలింది.

"ఊఁ" అంది ప్రతిమ.

నోట్లోంచి శబ్దం మాత్రం బైటికి రాలేదు.

వాలు కుర్చీలోంచి లేవలేదు.

ఎదురుగా టీవీలో కార్యక్రమాలు వస్తూనే ఉన్నాయి.

❋

"బోడిగుండు - బొప్పిరాయిగుండు"

"అందరి బంధువయా భద్రాచల రామయ్యా... ఆదుకునే ప్రభువయ్యా... మా అయోధ్య రామయ్యా..." అబ్బ ఎంత మంచిపాట అనుకుంటూ. "ఏవండీ! మనం భద్రాచలం వెళ్దాం అండీ" అన్నా గారంగా.

"ఏమిటీ! రేడియోలో భద్రాచలం అన్న పేరొచ్చిందని భద్రాచలం వెడదాం అన్నావ్... మరి బ్యాంకాక్ అన్న పేరొస్తే బ్యాంకాక్ వెడదాం అంటావా, అసలు భద్రాచలం ఎక్కడో తెలుసటే నీకు" అన్నారు నాకేవీ తెలియనట్టుగా.

"నేను జీ.కేలో మరీ అంత పూర్ ఏవీ కాదులెండి. అదీ మన ఆంధ్రప్రదేశ్‌లోని ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం అనే ఊరునుండి ఓ గంట ప్రయాణం. బస్‌లో వెడితే దారిలో పాల్వంచ అనే ఊరుకూడా వస్తుంది" నా తెలివికి నేనే తెగమెచ్చుకుంటూ, చెప్పా.

"అయ్య బాబోయ్! నీ జంద్రల్ నాలెడ్జికీ నా జోహార్లు, నువ్వెప్పుడయినా వెళ్ళావా ఏంటి అంత కరెక్ట్‌గా చెప్పావ్" అన్నారు. నేనంత బాగా చెప్పగలనని అనుకుని వుండరు.

"చూడకపోవడం ఏంటీ! నా మూడోఏట ముచ్చటగా గుండు కొట్టించారట మా అమ్మావాళ్ళు అక్కడే" అన్నా నా చిన్ననాటి గుండును తల్చుకుంటూ.

"మళ్ళీ గుండు కొట్టించుకొనే ప్రోగ్రాం ఏవైనా పెట్టుకున్నావా ఏంటి, నిన్ను ఈ పిలకజడలోనే చూల్లేక పోతున్నా ఇహ ఆ గుండులో అస్సలు చూళ్ళేను అలాంటిదేం పెట్టుకోకు" అన్నారు.

"అబ్బా! నేనెందుకు కొట్టించుకుంటా. మీకే కొట్టించేస్తా ఆ గుండేదో" అన్నా ఈ మాటతో తిక్కకుదుర్తుందని.

"వామ్మోయ్! వుత్తి పుణ్యానికి పోయి తుమ్మెదరెక్కల వంటి నా జుట్టుని ఆ రాములోరికి ఇచ్చిరావాలా... నా వల్ల కాదు. కావాలంటే మన చింటూగాడికి కొట్టించెయ్, సమ్మర్ స్పెషల్ హాయిగా గాలాడుతుంది వెధవకి, చమటకాయలు రాకుండా వుంటయేం" తను తప్పించుకోవడానికి వాడిని అడ్డం పెట్టుకున్నారు.

"మమ్మీ! ప్లీజ్ అసలే స్కూల్స్ ఓపెన్ చేశారు. నా ఫ్రెండ్స్ అంతా నన్ను బోడిగుండు, బొప్పిరాయి గుండు" అనీ వెక్కిరిస్తారే, కావాలంటే అదిగో బూచిలా విరబోసుకుని తిరుగుతుందిగా ఆ దెయ్యం... దానిక్కొట్టించెయ్ నుబ్బరంగా తిక్కకుదురుతుంది" అన్నాడు కసిగా... అదంటే పడిచావడు మరి వాడికి. ఇలా తీర్చుకున్నాడు, ఇది విన్న పెద్దది.

"ఒరేయ్! నా గొడవ నీకెందుకురా, ఉండు అక్కడ నీకు గుండు కొట్టించీ ఆ గుండునిండా సున్నంబొట్లు పెట్టించేస్తా వెధవ. మళ్ళీ నా జోలికి రాకుండా" అబ్బా గొడవ ఇద్దరికీ క్షణం పడదుకదా.

"మీనా! రుతుపవనాలొచ్చినా ఎండలు వేయిగొడుతుంటే అక్కడికెందుకే, వెళ్ళావంటే సింగరేణి బొగ్గుల్లాగా అయిపోతావేమో ఏవోనే" అన్నారు చిత్రంగా.

"అరే! భలే గుర్తుచేసారండీ అక్కడ బొగ్గుగనుల్లోకి దిగి నాకు చూడాలని చాలా కోరికగా వుందండీ, చిన్నప్పుడు చూద్దా వంటే మా అమ్మా వాళ్ళు చూపించలేదు" అన్నా ఏవంటారోనని.

"ఏంటీ! ఆ గనుల్లోకి దిగి చూస్తావా, ఆ చీకటిని చూసి మీరంతా భయపడిపోతారే బాబూ! అయినా అదేమన్నా కాశ్మీర్ అందాలనుకున్నారా చూసి తరించటానికి" అన్నారు వెటకారంగా,



అదేమరి! "దూరపు కొండలు నునుపు" అనీ, ఎక్కడో ఏ రాష్ట్రంలోనో వున్న తాజ్‌మహల్ అందాలు, మహారాజా ప్యాలెస్‌లు చూడాలని అనుకుంటారు. కానీ మన రాష్ట్రంలో వున్న, మన ఆంధ్రాకే ఆడపడుచు లాంటి, కొన్ని లక్షలమంది కార్మికులకు అన్నం పెడుతున్న అన్నపూర్ణమ్మ తల్లిని చూడాలని నేననుకోవడం మీకు తప్పుగా అనిపిస్తోందా. మీరేవైనా చెప్పండి వెళ్ళి తీరాల్సిందే" కచ్చితంగా నామాట చెప్పేసాను.

"చూడమ్మా! కార్మిక కర్షిణీ! అయితే వెళ్ళే తీరాలంటావ్"

"అవునండీ! వెళ్ళే తీరాలి, పిల్లలక్కూడా అన్నీ తెలియాలంటే, ఇలా స్విచ్ వేయగానే లైట్ వెలుగుతుంది. అలా ఫ్యాన్ తిరుగుతుంది. ఏ.సీ.లూ, ఏయిర్ కూలర్‌లు, ఫ్రిజ్ వాటర్ కూల్‌గా తాగడం, టీ.వీలు, కంప్యూటర్‌లు, ఓ అన్నీ సుఖంగా పెట్టుకుంటున్నారే, అసలు ఆ కరెంటు ఎలా మనకు వస్తోంది. మరి బొగ్గు ద్వారా వస్తోందని వాళ్ళకు తెలియదు, రైళ్ళు నడుస్తున్నాయని తెలియదు. అక్కడ బొగ్గును వెలికి తీయడానికి పాపం ఆ కార్మికులు ఎంత శ్రమ పడి తీస్తారో పిల్లలు కళ్ళారా చూస్తేగానీ ఈ కరెంటు విలువ తెలియదు. మరి ఫ్యాన్‌లు తిరుగుతూవుంటే నిర్లక్ష్యంగా వదిలేసి తిరుగుతారు. ఆ కష్టం చూస్తేనయినా వీటి విలువ తెలుస్తుంది. అందుకే దగ్గరుండి అన్నీ చూపించి తీరాల్సిందే అప్పుడయినా కాస్త కరెంటును ఆదా చేయడం నేర్చుకుంటారు", ఇక అటునుండీ భద్రాచలం వెడదాం, మీరెళ్ళి రాత్రికి టిక్కెట్స్ రిజర్వు చేయించి తీసుకురండి" హమ్మయ్య అన్నీ చెప్పేసా అనుకున్నా.

పి. జ్యోతి

"భద్రాచలంలో ఏం చూద్దావనీ" ఏంటీ ఆ అడగడం ఈయన

"ఆ... శూర్పణఖని" అన్నా కోపంగా

"అవునేలే నీకూ ఆవిడకీ దగ్గరికి పోలికలున్నాయిగా"

"ఏవండీ! నాకు చాలా కోపం తెప్పిస్తున్నారు. భద్రాచలంలో ఏం చేస్తారు రాములవారినీ! సీతమ్మనూ... అవునులెండి మీరూ ఆ వానర సైన్యంలో ఒకరై వుంటారు అప్పుడు, అందుకే అలా అడుగుతున్నారు".

"డాడీ! నాకు విండో దగ్గర సీటుకావాలీ" అన్నాడు చింటూ.

"ఒరేయ్! నీక్కాదు నాక్కావాలి, డాడీ నాకే" అంది పాప

"ఒరేయ్! మీ ఇద్దరికీ కాదు నాకే కావాలి. హాయిగా కవిత్వం పాడుకుంటూ కూచుంటా" అన్నారీయన

"ఎవ్వరు విండో దగ్గర కూచుంటే వాళ్ళు మాత్రమే గుండు కొట్టుంచుకోవాలి" అన్నా, అంతే.

"వామ్మోయ్! నాకొద్దు విండో సీటు" అనరిచారు అంతా. ❋

"తల్లీ నిన్ను తలంచి"..!

రుక్మిణి

గుర్నాథం ఆ రోజు ఆఫీసుకు సెలవు పెట్టాడు. సాధారణంగా సెలవులు పెట్టడు. ఈ విషయంలో చాలా పొదుపరి. అందుకే భార్య చాలా ఆశ్చర్యపడిపోయింది. కారణం ఏమయింటుదోనని తలకు డామేజీ కాకుండా, చాలా జాగ్రత్తగా గోడకేసి బాదుకుంది.

గుర్నాథం కాగితాల కట్టలు... కొన్ని కరపత్రాలు... పేపరు కటింగులూ ముందేసుకుని సిగరెట్ మీద సిగరెట్ పీకుతూ లెక్కలు కడుతున్నాడు. ఒక్కోసారి జుట్టుపీక్కుని...జాలిగా నవ్వుకుంటున్నాడు.

"ఏంటండీ... ఏదైనా ఆఫీసు ప్రాబ్లమా? మానసిక నమస్యైతే తమ్ముడే... వాడే సైక్రియాట్రిస్టున్నాడుగా... పోయి..."

గుర్నాథం మీదపడి కరిచే తోడేలులా గుర్రుగా చూశాడు. తర్వాత తమాయించుకుని "ఏంటీ... ఈ వయసులోనే నాకు 'పిచ్చి' లాంటిది పుట్టిందని నీ ఉద్దేశమా? ఖబడ్దార్...! మీ తమ్ముడు పిచ్చి డాక్టరు. అసలు మీ టోటల్ వంశంలోనే వుంది పిచ్చి!" అని దబదబా నాలుగు తిట్లుతిట్టి మళ్లీ తన గొడవలో పడిపోయాడు.

అయితే సాధారణంగా మరో మానవుడు ఆ ఇంట్లో వున్న పరిస్థితుల్లో అట్లా నింపాదిగా కాగితాలు ఖరాబు చేస్తూ కూర్చుండలేడు. కారణమేమిటంటే అపుడే ఓ రాయిలాంటి బంతి వచ్చి గుర్నాథం గుండులాంటి బట్టతలను ముద్దెట్టుకుంది. అలవాటు పడిన ప్రాణం కాబట్టి చలించకుండా ఓ వెధవ నవ్వు నవ్వాడు.

గుర్నాథం అతి తక్కువ వ్యవధిలో ఎక్కువ ఫలితాలు సాధించాలనే మొండిరకం! స్వల్పకాలంలోనే 'కావలసింది' పూర్తిచేసుకుంటే మిగిలిన కాలమంతా కాలుమీద కాలేసుకుని 'శూన్యం'లోకి చూస్తూ గడిపేయొచ్చనే నమ్మకంగలవాడు. అందుకే పెండ్లయిన అయిదేండ్లకే వరసబెట్టి టకటకమని ముగ్గురాడపిల్లల్ని... ఇద్దరు మగపిల్లల్నీ ప్రసాదించి తీరిగ్గా సేదదీరాడు. వాళ్లందరూ కోతిమూకలా ఇపుడెదిగి పోయారు. ఇంట్లోని వస్తువులనీ...ఫర్నిచరునీ డామేజీ చేయడమేగాకుండా, అడపా దడపా తమకు అవయవనష్టమూ చేస్తున్నారు. ఇపుడు అర్జంటుగా వాళ్ళని బళ్లో చేర్పించాలి. అది ఏ స్కూలు... భవిష్యత్తెలా ఉంటుంది? శిక్ష(లు) ఎలా వుంటాయి? రేపు ఎంసెట్ ర్యాంకుకు పనికొస్తుందా? ఫారిన్ పునాదేర్పడుతుందా? ఇవీ గుర్నాథాన్ని వేధించే ప్రశ్నలు! ఫీజులమాట దేవుడెరుగు! మంచి ఉద్యోగమే కాబట్టి పెద్ద ఇబ్బందులేమీ ఉండవు.

ఎక్కడ? ఎపుడు? ఎలా?

"సుప్రభాతం... లోపలికి రావచ్చా!" అని ఓ పంచెశాల్తీ... పట్టులాల్చీ... వినయంగా అడుగుతూనే లోనికెంటరయ్యాడు. గుర్నాథం షాకయ్యాడు. ఆ శాల్తీ వెంట అయిదారుగురు సిబ్బంది.

ఆ సిబ్బందిలో ఒకడు చంకలో నుండి నాద స్వరం జట తీసి, తన్మయంగా త్యాగరాజ కృతికి తగులుకున్నాడు. మిగిలిన వారు కుర్చీల్లో కూలబడి తాళం వేయసాగారు. గుర్నాథం పరవసించిపోయాడు. గుండెల్లో ఎవరో రసంపిండి కురిపిస్తున్నట్లు వుంది.

"ఏమే! నా జేబులో పదిరూపాయలుంటాయి. ఈ వాగ్గేయబ్రహ్మలకు సమర్పించు" అని ఇంట్లోకి కేకపెట్టాడు. నాద స్వరం ఠక్కున ఆగిపోయింది. పంచెశాల్తీ రుసరుస లాడింది.

"సారీ సర్... ముందు వేం మీకు చేయబోయేసేవలు... మాది 'నాద' డే అండ్ రెసిడెన్షియల్ ఇంగ్లీషు-తెలుగు మీడియం స్కూలు. మీ పిల్లలందర్నీ మా పాఠశాలలో చేర్పించి మీరిక మీ పనులు జేసుకుంటూ నిర్భయంగా వుండవచ్చు! మనిద్దరి కులం... శాఖ...కలిశాయని కనిపెట్టే నేను మీ ఇంటికొచ్చా! ఫీజుల గురించి మీరేం బెంగపడకండి. మీ శాలరీ ఆథరైజేషనిస్తే చాలు... ఇదుగో ఫారాలు!"

నాద స్వరం మళ్లీ తగులుకుంది. గుర్నాథం లేచి శివాలెత్తి, తిట్లకు తగులుకున్నాడు. ఆ బృందం విసుక్కుంటూ బయటికి పోయారు.

"అయ్యో...గంగిరెద్దులోళ్ళను అపుడే పంపించారూ... చూడక చాన్నాళ్లయింది. ఎద్దు ఏదీ?

భార్య అనసూయ నొక్కుతుంటే గుర్నాథం మండిపడ్డాడు. పిల్లలు 'గంగిరెద్దు-గంగిరెద్దు' అని గోలకు తగులుకున్నారు. తొందరలో ఈ మూకని ఏదో స్కూల్లో చేర్పించకపోతే నేను చావడం ఖాయం! గుర్నాథం మళ్లీ జుత్తుపీక్కున్నాడు.

"వదినగారూ... వదినమ్మా?" శ్రావ్యమైన కంఠస్వరం వినిపించింది. గుర్నాథం తలెత్తి చూశాడు. తెల్లని అందమైన యువతి లోపలికొచ్చింది. ఆవిడ వెంట మరో రెండు పెద్ద మొఖాలు ఇకిలిస్తూ వచ్చాయి. ఆవిడ రాంగానే "వదినమ్మా" అని అరుచుకుంటూ వంటింట్లోకురికింది. ఆ ఇద్దరూ కుర్చీలోకూలబడి వాతావరణం... ఎండ...ఆరోగ్యం వంటి ముచ్చట్లకు తగులుకున్నారు. గుర్నాథానికిదంతా అయోమయంగా ఉంది.

"అన్నట్లు మీ షుగరు ఏ లెవెల్లో ఉంది. వీడు మా బామ్మర్ది... స్పెషలిస్టు!" మాట ముగించేలోగానే ప్యాంటు వాలా బరబరా గుర్నాథం చేయందుకుని, పరీక్షించి ఓ చిన్ని గాజుసీసా చేతిలో పెట్టి, ఒంటివేలు చూపించి సైగలు చేశాడు. గుర్నాథానికి ఒళ్ళు మండిపోయింది.

"ఇన్‌స్టంట్ టెన్స్! అమోఘమైన అమెరికా మందులు...ఈ సంచిలో...మీకు ఉచితం? రోజూ పరగడుపున ఒక మాత్ర తగిలిస్తేచాలు. 24 గంటలు నో ట్రబుల్. మీరింక స్వీట్లన్నీ లాగించొచ్చు...!" అని ఇద్దరూ చెరోడబ్బీ అందుకుని గుర్నాథాన్ని 'దాని' కి పురమాయించాడు. గుర్నాథం మెదడు మొద్దుబారి బాత్రూంలోకురికాడు. "వదినెమ్మా...పులుసు మసల బెట్టే విధానం అదికాదు. ఇలా... అద్సరే దొండకాయలేంటి? అట్లా అడ్డంగా తరిగారు. ఇదుగో ఇలా" ఆ పడుచమ్మాయి కూరలు ముందేసుకుని తరిగి పారేస్తుంది. చెంగున గెంతి అన్నం కలబెడుతుంది. అనసూయ అబ్బురంగా చూస్తుంది.

గుర్నాథం పరీక్షలయి పోయాయి. ప్యాంటువాలా ఓ ప్లాస్టిక్ డబ్బా మాత్రలది చేతిలోపెట్టాడు. "చూడండిసర్... మా 'దానం' స్కూల్లో మీ మొత్తం పటాలాన్ని చేర్పించండి. మీరిపుడు ఫీజులకేం ఆరాటపడవద్దు. సింపుల్... ఇది మీ స్వంత ఇల్లేగదా! మీ పిల్లల సర్వ బాధ్యతలు మావి! టిఫిన్, లంచ్, స్నాక్స్, డిన్నర్, ఆటలు, కరాటే, యోగా, డాన్సింగ్, స్విమ్మింగ్, డ్రీమ్స్... అబ్బో...!"

గుర్నాథం లబలబలాడి పోతున్నాడు. జుట్టుపీక్కున్నాడు.

"సింపుల్" అని వాడు ఇల్లంతా కలదిరిగాడు. తర్వాత "ఏంలేదు... ఈ పోర్షను ముందుస్తుగా మాకు రిజిస్ట్రీ చేయించండి. నెమ్మదిగా నెలనెలా వాయిదాలు కడుదురుగానీ..."

గుర్నాథం తల తిరిగిపోయింది. చెంగున లేచి మీదపడి రక్కేంత పని చేశాడు. వాళ్లూ... లోపల పడుచమ్మాయి

తుర్రుమన్నారు. గుర్నాథం తన భార్యనూ...పిల్లలనూ తిట్లకు లంకించుకున్నాడు.

"ఆ పిల్ల మొత్తం వంట టెక్నిక్కులన్నీ నేర్పిందండీ!" అనసూయ మరింకేం మాట్లాడకుండా గుర్నాథం బకాసురుడిలా మీదికెగబడ్డాడు. తలుపుల్ని ఓ తన్నుతో తోసిపారేశాడు. "వెధవగోల... ఛ..." విపరీతంగా తనను తాను తిట్టుకున్నాడు. ఈ సారి విసురుగా వచ్చిన బంతి నడుం మీద తగిలి కలుక్కుమంది. గుర్నాథం ఒండ్రపెట్టాడు.

ఎవరో తలుపు టకటక తట్టారు.

గుర్నాథం తెరిచేలోగానే తోసుకొని ఓ వ్యక్తి లోపలికొచ్చాడు. ప్యాంటు నలిగి వుంది. మనిషి బేలగా వున్నాడు. కళ్లు లోతుకు పోయాయి. దైన్యంగా చూస్తున్నాడు.

"చందాలివ్వడం కుదర్దు... వెళ్లు..." గుర్నాథం గాండ్రించాడు.

"చందాలు కాద్సార్... మీరు పెద్దలు... నేను పక్కవీధిలోని గవర్నమెంటు స్కూలు హెడ్మాస్టర్ని. మా స్కూల్లో అందరం పిల్లల్ని బాగా చదివిస్తాం... కష్టపడతాం. మీ పిల్లలకేఫీజూ లేదు... తీర్చిద్దే బాధ్యత మాది. మా స్కూల్లో చేర్పించండి! ఈ కార్పొరేటు స్కూళ్ళు.. వీటి భాగోతం మీకు తెలవంది కాదు..."

ఆయనగారు చెపుతుంటే మెరిసే కళ్లల్లో గుర్నాథం అనసూయ వంక చూశాడు. అప్పటికే ఆవిడ కళ్ళు మెరుస్తున్నాయి.

❋

డా॥ ఉమా జ్యోతి



మనకున్న సమస్యల గురించి ఆఫీసులో ఉన్న సమయంలో ఆలోచించటం వలన విసుగు, అలసట, నీరసం కలుగుతాయి. దాంతో మన పనుల్లో వెనుకబడతాం లేదా తిట్లుతింటాం. అంటే ఉన్న సమస్యలు రెట్టింపు అవుతాయి. కాబట్టి పనిచేసేటప్పుడు ఏకాగ్రతతో, ఆసక్తితో చేస్తే తప్పకుండా విజయం సాధిస్తాం. మనం మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి మొదటి మెట్టు సానుకూల దృక్పథం. ఏది జరిగినా అంతా మన మంచికే అనుకోవాలి అని పెద్దలు ఎప్పడూ చెపుతారు కదా... మన జీవితంలో ఏమన్నా సమస్యలు వచ్చినా, అపజయాలు ఎదురైనా వాటిని విశ్లేషణాత్మకంగా ఆలోచించి పరిష్కరించుకోవాలే కానీ కుంగిపోకూడదు. ఏ సమస్య వచ్చినా తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుందాం అనుకునే వాళ్ళుంటారు. అలాంటి వాళ్ళందరికీ ఒక చిన్న సూచన. మీకు ఏదైనా సమస్య ఉన్నప్పుడు మీ దగ్గరి వాళ్ళతో, బాగా నమ్మకమున్న వాళ్ళతో మీ సమస్య గురించి చర్చించండి. ఒత్తిడి లేదా దుఃఖంలో ఉన్నప్పుడు ఏదీ సరిగా ఆలోచించలేము.

మానసిక సౌందర్యాన్ని మెరుగు పరచుకోవడం ఎలా?

అందం అంటే ఏమిటి? చాలా క్లిష్టమైన ప్రశ్న. ఎందుకంటే ఒక్కొక్కరి అభిప్రాయం ఒక్కో విధంగా వుంటుంది. కాబట్టి అందం అంటే మంచి రంగు, శరీరనిర్మాణం, ఎత్తు, బరువు లేదా మంచి నవ్వు, జుట్టు ఇలా రకరకాలుగా చెప్తుంటారు.

అయితే అందం అనేది రెండు రకాలు.

1. బాహ్య సౌందర్యం.
2. అంతఃసౌందర్యం.

ఎవరైనా ఎంత అందంగా ఉన్నా సరైన ప్రవర్తన, స్వభావం లేకపోతే ఎవరినీ ఆకర్షించరు. అందంగా ఉన్నా అహంభావం, పొగరు అనేది ఉండకూడదు. అలాంటి వారిని తొలిచూపులో బాగున్నారు అనుకున్నా తరువాత వారి మాట తీరుకు అందరూ దూరమవుతారు. నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుంది అంటారు. అందరితో మంచి తనంతో మాట్లాడటం, వెక్కిరింతలు, వ్యంగ్యపు మాటలకు దూరంగా ఉండడం మంచిది.

తరువాత ముఖ్యమైనది ఇంట్లో మానసిక సమస్యలను మన వృత్తి, ఉద్యోగాల మీద పడేలా చేయటం. ఉదాహరణకు ఇంట్లో ఎవరితోనన్నా తగవు పడినా, ఆర్థిక సమస్యలు, ఆరోగ్య సమస్యలు ఉన్నా పనిలో ఉన్నప్పుడు కూడా వీటి గురించి ఆలోచించడం చాలా మంది చేస్తారు. అది చాలా తప్పు. సమస్యలు అనేవి ప్రతి ఇంట్లోనూ ఉంటాయి. కాకపోతే ప్రతి ఒక్కరూ తామే కష్టపడుతున్నామని, మిగతావాళ్ళ బాధలన్నీ చాలా చిన్నవని భావిస్తుంటారు. మనకున్న సమస్యల గురించి ఆఫీసులో ఉన్న సమయంలో ఆలోచించటం వలన విసుగు, అలసట, నీరసం కలుగుతాయి. దాంతో మన పనుల్లో వెనుకబడతాం లేదా తిట్లుతింటాం. అంటే ఉన్న సమస్యలు రెట్టింపు అవుతాయి. కాబట్టి పనిచేసేటప్పుడు ఏకాగ్రతతో, ఆసక్తితో చేస్తే తప్పకుండా విజయం సాధిస్తాం. మనం మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి మొదటి మెట్టు సానుకూల దృక్పథం. ఏది జరిగినా అంతా మన మంచికే అనుకోవాలి అని పెద్దలు ఎప్పుడూ చెపుతారు కదా... మన జీవితంలో ఏమన్నా సమస్యలు వచ్చినా, అవజయాలు ఎదురైనా వాటిని విశ్లేషణాత్మకంగా ఆలోచించి పరిష్కరించుకోవాలే కానీ కుంగి పోకూడదు. ఏ సమస్య వచ్చినా తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుందాం అనుకునే వాళ్ళుంటారు. అలాంటి వాళ్ళందరికీ ఒక చిన్న సూచన. మీకు ఏదైనా సమస్య ఉన్నప్పుడు మీ దగ్గరి వాళ్ళతో, బాగా నమ్మకమున్న వాళ్ళతో మీ సమస్య గురించి చర్చించండి. ఒత్తిడి లేదా దుఃఖంలో ఉన్నప్పుడు ఏదీ సరిగా ఆలోచించలేము. భవిష్యత్తు అంతా శూన్యంగా, కష్టాలు తీర్చలేనివిగా ఉంటాయి. అదే వేరే వారికి ఆ సమస్య సులభంగా అర్థం అవుతుంది. పరిష్కారం కూడా చెపుతారు. ఎందుకంటే వాళ్ళు ఒత్తిడిలో ఉండరు కాబట్టి.

కొందరు న్యూనతా భావంతో ఉంటారు. వాళ్ళకు డబ్బు లేదనో, అందం లేదనో, మిగతా వారిలా కార్లు, డ్రస్సులు లేవనో తమను తాము తక్కువగా అంచనా వేసుకుంటారు. అలాంటి వారికి ఒక సూచన. ప్రతి ఒక్కరికీ అన్నీ ఉండవు. లేని వాటి గురించి ఆలోచించటం మానేసి ఉన్న సానుకూల అంశాలను వెలుగులోకి వచ్చేలా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోండి. మీకున్న ప్రత్యేకతలేమిటో గుర్తించి వాటిని ఇంకా మెరుగుపరచుకోండి.

పదిమందిలో మాట్లాడుతున్నప్పుడు టెన్షన్‌ను, ఉద్రేకాన్ని అదుపులో ఉంచుకోండి. దీనికోసం ప్రతి ఒక్కరూ మెడిటేషన్, ఇతర వ్యాయామాలు చేయాలి.

అందరూ ఉద్యోగంలోగాని, సమాజంలోగాని పైకి రావటానికి సోషల్ కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరచుకోవాలి. కొందరు గ్రూపులో లేదా స్టేజీ మీద మాట్లాడటానికి, బేరం చేయటానికి భయపడతారు. ఫీల్ అవుతారు. బాగా ఎక్కువ టెన్షన్ ఉన్న వాళ్ళు మానసిక వైద్య నిపుణుని సహాయం తీసుకోండి. చిన్న సమస్యలు ఉన్న వాళ్ళు ఏదన్నా శుభకార్యం లేదా ముఖ్యమైన సమావేశంలో పాల్గొనబోయే ముందు బ్రీథింగ్ ఎక్సర్‌సైజ్ చేయండి. స్పష్టంగా, నిదానంగా మాట్లాడండి. గబగబా లేదా లోగొంతుతో మాట్లాడితే అవతలి వాళ్ళు వినబడక. అర్థంగాక గందరగోళపడతారు. పది రకాల ప్రశ్నలు వేస్తారు. దాంతో మనమింకా గందరగోళ పడిపోతాం. కాబట్టి చెప్పదలచుకున్నది ఇంటి దగ్గర ఒకటి రెండు సార్లు ప్రాక్టీస్ చేసి నిదానంగా చెప్పండి. పుస్తకాలు చదవండి. పుస్తకాలు మీ వృత్తి, ఉద్యోగాలకు సంబంధించినవే కానక్కరలేదు. అన్ని రకాల పుస్తకాలు బాగా చదవండి. ప్రతిరోజూ పేపర్ చదవండి. చాలా మంది స్త్రీలు పేపర్‌లో స్త్రీల కాలమ్ లేక సినిమా కాలమ్ మాత్రమే చదువుతారు. అలా కాదు అన్ని విషయాలూ తెలుసుకోండి. దాని వలన ఏ విషయం మీదైనా కొంతైనా మాట్లాడగలుగుతాం. అందరిలో గుర్తింపు తెచ్చుకుంటాం. టీవీ, నెట్ కంటే చదవడంవల్ల జ్ఞానం పెరుగుతుంది. పుస్తక పఠనం అనేది మనం స్వంతంగా ఆలోచించటానికి సమయాన్నిస్తుంది. మనలో నైపుణ్యాన్ని పెంచుకోవడానికి అవకాశం ఉంటుంది. ఏ పుస్తకమైనా వారపత్రిక, వార్తా పత్రిక, నవల, ఇతర మ్యాగజైన్లు, చివరికి పొట్లం కట్టిన కాగితం అయినా

పడేసే ముందు చదవండి. ఎంత మెరుగుదల ఉంటుందో గమనించండి. మంచి అలవాట్లను కొనసాగించండి. వయసు పెరుగుతోంది కదా అని వదిలేయవద్దు. అవి మనలో మానసిక శక్తిని పెంచుతాయి.

కనీస వ్యాయామం ఎవరినైనా ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉంచుతుంది. అబ్బ ఆమె కాసేపు కూడా మాట్లాడలేదు. నడవ లేదు. అనిపించుకోకూడదు. ఏదన్నా అనారోగ్యం కలిగితే తప్ప వ్యాయామాన్ని అశ్రద్ధ చేయవద్దు. సంఘసేవ అనే మాట వింటేనే ఆ ఎక్కడ చేస్తాం లేండి మా దగ్గర అంత డబ్బు లేదు అంటారు. డబ్బు అక్కర లేదు మాట సాయం లేదా పనుల్లో సాయం చేయండి. దీని వలన తృప్తి కలుగుతుంది. పది మంది మెచ్చుకుంటారు. అందరిలో ఉండడం వలన సమాజంలో ఎలాంటి సమస్యలు ఉన్నాయో, మనమే కాదు సమస్యలు ఉన్న వాళ్ళు ఎందరో ఉన్నారని తెలుస్తుంది. పుష్కరాల్లో సాయం చేసిన వాలంటీర్స్‌ను మరచిపోగలమా. నవ్వు ముఖంతో ఉండండి. ఎప్పుడూ సీరియస్‌గా, విసుగ్గా వుండేవాళ్ళని చూస్తే తలనొప్పి వస్తుంది. కాబట్టి చిరునవ్వుతో మాట్లాడితే ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది.

మంచి ఆహారపు అలవాట్లు, పరిశుభ్రత, డ్రస్ సెన్స్ కూడా కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగు పరచడంలో ఒక భాగమేనని మరచిపోకండి. ఈ కమ్యూనికేషన్, సోషల్ స్కిల్స్‌ను మెరుగు పరచుకోవడం వలన మీ వృత్తి, ఉద్యోగాలలో ఎంతో ముందుకు వెళతారు. మన శరీరానికి, మనస్సుకు సంబంధం ఉంది. అదే శరీరానికి, మనస్సుకు ఉన్న సంబంధం. మనస్సు ఆందోళనకు గురయినప్పుడు సరిగా నిద్రపట్టదు, ఆకలుండదు, నీరసం, జుట్టు ఊడిపోవటం, బరువులో తేడా రావడం, కళ్ళకింద నలుపు మచ్చలు, చర్మం కళ తప్పడం, వృద్ధాప్యం వచ్చినట్లు కన్పించడం ఉంటుంది. జ్ఞాపకశక్తి తగ్గుతుంది. వాటి వలన చికాకు, ఒత్తిడి ఇంకా పెరుగుతుంది.

సంతృప్తిని మించిన సంపద లేదు.

ఆత్మవిశ్వాసాన్ని మించిన ఆయుధం లేదు.

దంత సంరక్షణ

క్విజ్-14

నిర్వహణ:
డా॥ కె.ఎల్.వి. ప్రసాద్, హన్మకొండ

1. **శస్త్రచికిత్సద్వారా దంతవైద్యం చేసే వైద్యులను ఈ విధంగా పిలుస్తారు.**
   అ) డెంటల్ సర్జన్
   ఆ) ఆర్థోడాంటిస్ట్
   ఇ) ఓరల్ సర్జన్
   ఈ) ప్రాస్థోడాంటిస్ట్
2. **ఎత్తుపళ్ళను, ఎగుడుదిగుడు పళ్ళను, వంకరపళ్ళను సరిచేసి, అందమైన పలువరుసగా తీర్చిదిద్దే దంతవైద్యులను ఈ విధంగా పిలుస్తారు.**
   అ) ప్రాస్థోడాంటిస్ట్
   ఆ) ఆర్థోడాంటిస్ట్
   ఇ) పీడో డాంటిస్ట్
   ఈ) ఏదీ కరెక్ట్‌కాదు
3. **కట్టుడు పళ్ళు, తత్సంబంధిత వైద్యవిధానాలను పర్యవేక్షించే దంత వైద్యులను**
   అ) ప్రాస్థోడాంటిస్ట్ అంటారు
   ఆ) ఆర్థో డాంటిస్ట్ అంటారు.
   ఇ) పీడో - డాంటిస్ట్ అంటారు
   ఈ) పెరియో డాంటిస్ట్ అంటారు
4. **పెరియో డాంటిస్ట్' అంటే**
   అ) చిన్న పిల్లల దంతవైద్యులు
   ఆ) కట్టుడుపళ్ళకు సంబంధించిన దంతవైద్యులు
   ఇ) చిగుళ్ళ చికిత్సకు సంబంధించిన దంతవైద్యులు
   ఈ) ఔషధ సంబంధమైన చికిత్సచేసే దంతవైద్యులు
5. **ఔషధ పరమైన చికిత్స చేసే దంతవైద్య విధానాన్ని యిలా పిలుస్తారు.**
   అ) ఓరల్- మెడిసిన్
   ఆ) ఓరల్ సర్జరి
   ఇ) ఆపరేటివ్ డెంటల్ సర్జరి
   ఈ) ఆర్థోడాంటిక్స్
6. **ఫిల్లింగులు-తత్సంబంధమైన చికిత్సా విధానాలను నిర్వహించే దంత వైద్య విభాగాన్ని ఈ విధంగా పిలుస్తారు**
   అ) ఓరల్ సర్జరి
   ఆ) డెంటల్ సర్జరి
   ఇ) ఫిల్లింగ్ సర్జరి
   ఈ) ఆపరేటివ్ డెంటల్ సర్జరి
7. **వ్యాధుల గురించి, వ్యాధి నిర్ధారణ గురించి, దంతకణజాల పరీక్షల గురించి తెలియజెప్పే దంతవైద్య విభాగాన్ని యిలా పిలుస్తారు.**
   అ) ఓరల్ పెథాలజి
   ఆ) ఓరల్ సర్జరి
   ఇ) డెంటల్ పెథాలజి
   ఈ) అన్నీ తప్పే!
8. **'పీడో-డాంటిస్ట్' అంటే**
   అ) వృద్ధుల దంత వైద్యుడు
   ఆ) మహిళల దంతవైద్యులు
   ఇ) యౌవ్వనుల దంతవైద్యుడు
   ఈ) చిన్న పిల్లల దంతవైద్యుడు
9. **సౌందర్య దంత వైద్యాన్ని అందించే వారిని**
   అ) ప్రాస్థో డాంటిస్ట్ అంటారు
   ఆ) ఆర్థోడాంటిస్ట్ అంటారు
   ఇ) పీడోడాంటిస్ట్ అంటారు
   ఈ) కాస్మెటిక్ డెంటల్ సర్జన్ అంటారు
10. **దంతాల ద్వారా నేర పరిశోధన నిర్వహించే విభాగాన్ని యిలా పిలుస్తారు.**
   అ) ఫోరెన్సిక్ డెంటిస్ట్
   ఆ) ఫోరెన్సిక్ ఓ డెంటాలజి
   ఇ) ఫోరెన్సిక్ ఓరల్ మెడిసిన్
   ఈ) అన్నీ కరక్ట్!

జవాబులు:
1) ఇ 2) ఆ 3) అ 4) ఇ 5) అ
6) ఈ 7) అ 8) ఈ 9) ఈ 10) అ

పర్యాయపదం

అన్నం పెట్టిన కుండ మోసపోయి అంతరిస్తున్న కులవృత్తులు గ్లోబల్ రాక్షసి చేతుల్లో నలిగిపోతున్న ఆవేదనాభరిత దృశ్య కావ్యం, నలిగి పోయిన మనస్సంకలనం ఈ పర్యాయపదం. అనుభవాల గాయాలు, కరెంటు తీగలకు చుట్టుకున్న గాలిపటం లాంటి బాల్యచిత్రాలు వెన్ను విరిగిన జీవన వ్యవసాయాల దృశ్యాల కవనాలతోబాటు బాణాల షణ్ముఖాచారి గారి కుంచె చిత్రాలు ఈ సంకలనానికి వన్నె తెచ్చాయి.

''చేవను గాలంలో లాగినట్లు లాగేది జ్ఞాపకం అని వెంటాడే బాల్య స్మృతుల్ని నెమరేసుకుంటూనే నెలవంక లాంటి తన తెలంగాణా పల్లెను పరులు పాములు కాటేసి విషం బారి పాలిపోయిన వైనానికి హృద్యమైన రూపకల్పన నిచ్చాడు కవి.

బ్రతుకు చిత్రాలన్ని నిరాశతో మొదలైనా, బ్రతుకు పయనించేది ఆశపై అని కవి చాలా నిజాయితీగా చెప్పాడు. ఈ విషయాన్ని "ఆకులన్ని రాలినా ఎదురు చూపుల్లో కోయిలపాట ఎప్పటికైనా చిగురించకపోతాయా కొమ్మలు'' "భూమిని చుట్టూరా తిప్పి గాల్లో విసిరేసినా మళ్ళీ వచ్చి పడేది జేబులోనే"

రోగి చనిపోయినాక రోగమింక మిగిలిఉండే ప్రశ్నేలేదు. గ్లోబల్‌రాక్షసి పనితనం ఇదే. అంతా కార్పోరేట్ అయ్యాక 'సన్నకారు పేద, దిగువ మధ్య తరగతి, మధ్యతరగతి లాంటి పదాలు తుడిచిపెట్టబడుతున్నాయి. ఇంక కులవృత్తులెక్కడ మిగిలిఉంటాయి. ఒకప్పుడు స్వర్ణకారుల అన్నం పెట్టిన 'కుంపటి', మూస, గాడిరాయి --- జ్ఞాపకాలుగానే మిగిలిన దృశ్యాన్నే శ్రీనివాసాచారి కులవృత్తికి 'పర్యాయ పదం'గా ఎంచుకుని చిత్రించిన 'కుంపటి' కవితలో

"మాకు తెల్లారేది
ఇంట్లో కుంపటి
రాజేసినప్పుడే
కుంపట్లో వెండి
బంగారం కరిగితేనే
మా పొయ్యిమీద
అన్నాలు ఉడికేది.
"నాయన
కర్రలకు ముల్లు కొడితేనే
మా ఊరిపొలాల్లో అరకలు
కదిలేవి
ఎంత సోమరి ఎడ్లైనా
ముల్లు కర్ర పిర్రలకు తగిలితే
చాలు
ఎకరాలు ఎకరాలు
పొలాలుదున్నేవి"

36 కవితలు గల ఈ సంకలనంలో వైవిధ్య భరితమైన అంశాలు ఉన్నాయి. జ్ఞాపకం, ఆవేదన, అస్తిత్వం, వైరాగ్యం ఆశ, నిరాశ ఇలా అన్నీ... కొన్నింటిలో పరిపక్వత స్పష్టంగా కనిపిస్తుంది. మిగిలిన వాటిలో సంఘర్షణ కనిపిస్తుంది. బాణాల శ్రీనివాసరావు నుంచి మరిన్ని మంచి కవితాబాణాల్ని ఆశించవచ్చు.

- బుర్రా సాయిబాబు.

పర్యాయపదం
(కవిత సంకలనం)
రచయిత: బాణాల శ్రీనివాసరావు
వెల: 50రూ.
దొరుకుచోటు:
విశాలాంధ్ర, ప్రజాశక్తి
(అన్ని బ్రాంచీలు)

స్వీకారం



తెల్లకాకులు
వసుధ బసవేశ్వరరావు
వెల:రూ. 25/-
పేజీలు: 40
ప్రతులకు: డో.నెం. 4/96, లక్ష్మీనగర్ కాలనీ, బందరురోడ్, గుడివాడ, (కృష్ణా)

చామ్‌స్కీ వ్యాసాల కూర్పు

నోమ్ చామ్‌స్కీ
రచయిత: ముక్తవరపు పార్థసారథి
వెల: రూ. 50/-
పేజీలు: 125
దొరుకుచోటు:
విశాలాంధ్ర, నవోదయ, కాచీగూడ అన్ని బ్రాంచీలలో

ప్రపంచ ఆధిపత్యం కోసం అమెరికా అల్లే కట్టు కథల్ని విప్పిచెప్పగలిగే మేధావుల్లో నోమ్ చామ్‌స్కీ ఒకరు. అమెరికాలో భాషా శాస్త్రం బోధించే ఉపన్యాసకుడు. డెబ్భై పైబడ్డ ఈ మేధావి విశ్రాంతిలేని యోధుడు. అమెరికా సామ్రాజ్య వాదాన్నీ, కుట్రలను, కుతంత్రాలను విప్పిచెప్పే బాధ్యతను నెరపుతున్నాడు. ఆయన విమర్శావిధానం, విశ్లేషణాత్మక శైలి, ఉంటే విషయాన్ని వివరణాత్మకంగా రాజకీయానుభవంలేని సామాన్యులను సైతం ఆలోచింపజేస్తోంది. చామ్ స్కీ పలు సందర్భాల్లో రాసిన వ్యాసాలు, వ్యక్తపరిచిన భావాల్ని ప్రజాశక్తి బుక్‌హౌస్ "ఆలోచనే ఆయుధంగా" నోమ్ చామ్ స్కీ పేరుతో తెలుగు పాఠకులకు పరిచయం చేసింది.

పది సంవత్సరాల క్రితం అమెరికా సామ్రాజ్యవాదం గురించిగానీ, గ్లోబలైజేషన్ విషప్రభావం గురించిగానీ ఏ కొందరికో (ముఖ్యంగా కాస్తయినా ఇంగ్లీష్ చదివో, వినో అర్థం చేసుకోగలవారికి) తెలిసేది. కాని సామ్రాజ్యవాదం సృష్టించిన సరళీకృత ఆర్థికవిధానాలు, గ్లోబలైజేషన్ కన్న "కల్లల" గురించి ఈనాడు పల్లెలకు సైతం దానిలోని కుట్ర అర్థమైంది. ఈ చైతన్యం తీసుకురావడంలో కృషి సల్పిన ప్రపంచీకరణ వ్యతిరేఖవాదులు మరింత జాగ్రత్తగా వ్యూహాన్ని రచించాల్సిన ఆవశ్యకత ఉందని చామ్ స్కీ రచనలు చదివితే తెలుస్తుంది.

''శత్రువు అవతలి శిబిరంలో ఉన్నప్పుడు ఎదుర్కోవడం తేలికే. కానీ ఇప్పుడు శత్రువు మన పక్షంలోనే పలురూపాల్లో కన్పిస్తున్నాడు. ఆ రూపాల్ని గుర్తించడంలోనే సగం విజయం" ఓ సందర్భంలో మావో అన్న మంటలను అనుసరిస్తూ, తన రచనాబలంతో ప్రపంచ ప్రజలకు అమెరికా ద్వంద్వ నీతిని, నీతిమాలిన నిర్ణయాలను బట్ట బయలు చేశాడు నోమ్ చామ్ స్కీ

అమెరికా అహంకారాన్ని, ప్రపంచ పోలీసుగా వ్యవహరించే తీరును, ప్రపంచాన్ని తన ఉత్పత్తికి మార్కెట్‌గా మార్చే ఆలోచనలను "పత్తి కోసం కల్తీ" 'రహస్య పత్రాలు', 'ఎవరి నుంచి ప్రమాదం?" వంటి వ్యాసాల్లో నిశితంగా బట్టబయలు చేశారు.

అంతేకాదు చామ్ స్కీ ఎంచుకునే ఉదాహరణలు, ఉటంకించిన సంఘటనలు 'సోకాల్డ్ విమర్శకుల నోళ్ళకి తాళాలు' అని చదివిన పాఠకులకే ఫీలయ్యేంతగా ఉన్నాయి.

పనిగట్టుకొని కావాలనే అమెరికామీద విమర్శలెందుకు చేస్తున్నారనే ప్రశ్నకు చామ్ స్కీ ఇచ్చిన సమాధానం మేధావుల్ని సైతం ఆలోచింపజేస్తుంది. అంతేకాదు. ఆ సమాధానంలో ఆయన దృఢ సంకల్పం కన్పిస్తుంది. ప్రపంచ దేశాల్లో తన దేశం (అమెరికా) సృష్టిస్తున్న అరాచకాల్ని, ఆర్థిక, రాజకీయ అనిశ్చిత చర్యల్ని విమర్శించడంలో చామ్ స్కీ ఆశిస్తుందేమిటి? అన్న ప్రశ్నకు ఆయన సమాధానం "అమెరికా నా దేశం గనక". ప్రతి పౌరుడూ తన దేశం ఉన్నతమైన మానవీయ విలువల్ని కల్గి ఉండాలని కోరుకోవడంలో తప్పులేదు. కానీ దానికి భిన్నంగా ప్రపంచంలో జరిగే హింసలో అధిక భాగాన్ని పులుముకుంటుంటే ఏ పౌరుడూ సహించలేడు. తను చేయగల చేతనైన పనితో ప్రారంభిస్తాడు. అట్లాంటి పనే నోమ్ చామ్ స్కీ చేస్తున్నాడు. అది తన బాధ్యతగా చెప్పుకోవడంలో అతని దేశభక్తి ప్రపంచశాంతి కాంక్ష కన్పిస్తుంది.

చామ్ స్కీ వంటి మేధావుల రచనల్ని, ముఖ్యంగా తెలుగు ప్రజలకు తెలియాల్సిన సమస్యలను పూర్వాపరాల తో సమగ్రంగా ఆయన వ్యక్త పరిచిన భావాల్ని ఒక పుస్తకరూపంలో తీసుకురావడం అభినందనీయం. మొత్తం ముప్పైరెండు వ్యాసాలూ అక్షరజ్ఞానమున్న ప్రతీ ఒక్కరికీ చేరాల్సినవే. అంతే కాదు మరిన్ని కొత్త ఆలోచనలకే వ్యాసాలు నాంది పలుకుతాయనడంలోను సందేహం లేదు. సరళంగా, సూటిగా తెలుగు పాఠకులకందించిన అనువాదకులు అభినందనీయులు.

-సైదులు ఐనాల

చెత్తమ్మా! చెత్తా!

ముదిగంటి సుజాతారెడ్డి

"సుశీ! సుశీ! ఇంట్లో వున్నావా?" అరుస్తూ లోపలికి వచ్చింది లలిత.

"ఏమైందే? ఏంది నీ హడావిడి?" అన్నాన్నేను ముందలి వరండాలోకి వస్తూ.

"రాత్రి నాకు చాలా మంచి కల వచ్చించే సుశీ! ఆ కల నిజమైతే ఎంత బాగుండుననిపిస్తుంది నాకు" అంది లలిత.

"ఇంతకు ఏం కల అది. పట్టపగ్గాల్లేకుండా చాలా ఉత్సాహంగా, సంతోషంగా వున్నావు. కల ఏమిటో చెప్పు!" అడిగాన్నేను.

"చాల అందమైన కలే అది. రోడ్లమీద ఎక్కడా చెత్త లేదు. రోడ్లపక్కన ప్లాస్టిక్ సంచుల్లో చెత్తమూటలు కన్పించటం లేదు. ఇక చెత్త కుండీల దగ్గర శుభ్రంగా ఊడ్చి వుంది. అసలు చెత్త అన్న మాట అక్కడ లేదు. శుభ్రమైన రోడ్లు చౌరస్తాలు, కాలిబాటలు నా కలలో సినిమా రీలులాగా దొర్లుతున్నాయి. స్పీడుగా, కలలోనే ఆ పరిశుభ్రమైన వాతావరణాన్ని చూసి ఆనందపడిపోతున్నాను. కాని బజార్ల నుంచి ఈ విధంగా చెత్త మాయం కావటానికి కారణం ఏమిటబ్బా అని కలలోనే నేను అనుకుంటున్నాను. ఆశ్చర్యపడిపోతున్నాను. నమ్మలేకుండా వున్నాను. ఇంతలో బండితో చెత్తవాడు కన్పించాడు. వాడు "చెత్తమ్మా! చెత్త! చెత్తమ్మా!", అని అరుస్తున్నాడు. ఏమిటయ్యా! చెత్త అమ్ముతున్నావా? అడిగాన్నేను. కాదమ్మా! కొంటున్నాను. కిలో పదిరూపాయలు!... అన్నాడు" చెప్తున్నది లలిత.

"అబ్బ! చెత్త కొనటమేమిటే" నవ్వు ఆపుకోలేకపోతున్నాన్నేను.

"అదేనే విను... చెత్త కిలోకు పది రూపాయలు అన్నాడు చెత్తవాడు. ఏం చేస్తారీ చెత్తతో అడిగాన్నేను కలలోనే. చెత్తలోంచి కరెంటు పుట్టిస్తున్నారమ్మా. అంతేకాదు. ఆ చెత్తనుంచి చెట్లకు వేసే ఎరువు తయారుచేస్తున్నారు. పట్నం బయట ఫ్యాక్టరీలు వచ్చాయి. ఈ చెత్తను తీసుకపోయి వేం వాళ్ళకు అమ్ముతాం. వాళ్ళకు కావల్సినంత చెత్త దొరకటం లేదని మొత్తుకుంటున్నారు. అందుకే మేము ఇంటింటికి పోయి చెత్తను కొంటామని అడుగు తున్నాం. కాని చెత్తను డైరక్టుగా తీసుకపోయి మేమే అమ్ముకుంటాం. బోలెడు డబ్బు వస్తుంది. ఈ మధ్య వర్తులకెందుకు అమ్మటం అని అందరూ తమ తమ చెత్తను భద్రంగా జమచేసుకొని పెట్టుకుంటున్నారు. ఇది నా చెత్త అంటే నా చెత్త అని ఇరుగు పొరుగువాళ్ళకు కయ్యాలు కూడా మొదలయ్యాయి. ఆ కయ్యాల లొల్లితో నాకు మెలుకువ వచ్చిందే సుశీ!" అంది లలిత నిరాశ పడిపోతూ.

"నీ కల చాల బాగుందే లల్లీ! ఆ కల నిజం అయితే ఎంత బాగుండును" నవ్వాన్నేను.

"నీకు నవ్వులాటగా వుంది. అటువంటి బంగారు కల ఎప్పుడు నిజమవుతుందా! నిజమయితే ఎంత బాగుండును. నా కల నిజమయ్యేరోజు ఎప్పుడు వస్తుందా! అని నాకు బాధగా వుందే సుశీ!" అంది లలిత గంభీరంగా "ఇంత అందమైన కల వచ్చినందుకు కంగ్రాచ్యులేషన్స్ లల్లీ!" అన్నాన్నేను.

"అదిగో! ఆ వేళాకోళమే వద్దంటున్నాను" కోపం నటించి నవ్వింది లలిత.

"చెత్తను గురించి ఆలోచిస్తూ పడుకున్నావేమో... అందుకే అట్లాంటి కల వచ్చింది" అన్నాన్నేను చిరునవ్వుతో.

"అదికాదే! నిన్న మా ఇంటి ముందు ఎవరో పనిమనిషి రెండు ప్లాస్టిక్ చెత్తమూటలు తెచ్చి వదిలిపోతుంటే చూసి గొడవ చేశాన్నేను. ఆ చెత్త సంచులు తీసుకపోయి చెత్తకుండీల దగ్గర వేయాలి. కానీ, ఇట్లాతెచ్చి విడిచిపెట్టే ఎట్లా అని అరిచాను. అందుకే రాత్రి అట్లా కల వచ్చింది" నవ్వింది లలిత.

"కాని లల్లీ! నీ కల నిజమైతే ఎంత బాగుండును! చెత్తకు అట్లా విలువ పెరిగితే బజార్లో, రోడ్ల వెంబడి ఎక్కడా చెత్త అనేది కన్పించకుండా పోతుంది. ఇంటి ముందల, దుకాణాల బయట ఎవరూ చెత్తవేయరు. శుభ్రంగా ఊడ్చుకొని చెత్తనెత్తి జాగ్రత్తగా పెట్టుకుంటారు. కలికానికైనా చెత్త కన్పించకుండా పోతుంది" నవ్వాన్నేను.

"అయినా ముందుగా అటువంటి చెత్తను సద్వినియోగం చేసే ఫ్యాక్టరీలు రావాలి. అప్పుడు చెత్తకు విలువ పెరుగుతుంది" లలిత కూడా నవ్వింది.

"లల్లీ! చాల మంచి కల కన్నావే! ఈ చెత్తతో చచ్చిపోతున్నాం. పొద్దున వాకింగ్ పోదామన్నా కష్టమే. ఎక్కడ చూసినా చెత్త మూటలు. పైగా ప్లాస్టిక్ సంచుల కోసమని కొందరు బయలుదేరుతారు. వాళ్ళు ఆ సంచి మూటలను విప్పి, చెత్తనంత అక్కడ చల్లివేసి ప్లాస్టిక్ సంచులను తీసుకపోతారు. ఈ చెత్తకుండీల దగ్గర కూడా చెత్తనంత కుండీల బయట ఎగజల్లి తమక్కావల్సిన ప్లాస్టిక్ సంచులు వగైరా తీసుకపోతారు. ఆ చెత్త దగ్గర అన్నం, తినుబండారాల కోసమని కుక్కలు చేరుతాయి. పొద్దున్నేగాని ఎప్పుడైనాగాని ఆ చెత్తకుండీల దగ్గర్నుంచి నడవటం దుర్భరమై పోతుంది. చెత్త చెల్లాచెదురుగా పడి వుండటమే కాదు వాసన వేస్తుంటుంది. ఇంత చెత్త వాతావరణం నుంచి ఎప్పుడు ఎట్లా విముక్తి లభిస్తుందో తెలియదు. మున్సిపల్ అధికారులు కొత్త కొత్త రకరకాల చెత్త కుండీలు కొని పెడ్తుంటారు. ఎన్నో విదేశీ వాహనాలను కొంటారు. కాని చెత్తను మాత్రం ఎత్తే ఏర్పాట్లను సక్రమంగా చేయరు. అయినా ఎవరి డ్యూటీని వాళ్ళు నిర్వహిస్తే సక్రమంగా చేస్తే ఈ బాధలుండవు మరి!" అన్నాను. "ఎవరి డ్యూటీ వాళ్ళు చేయాలంటే ఒకటి జ్ఞాపకం వస్తుందే సుశీ! నీళ్ళల్లో అంటే సంప్ నీళ్ళల్లో కాలుష్యాన్ని తొలగించటానికి మందు వేయటానికి వస్తారు మా ఇంటికి. మందు వేసిన తర్వాత డబ్బు అడుగుతారు. ఇనాం అమ్మ! అంటారు లేదా చాయ్ పైసలమ్మ అంటారు. అదేమిటయ్యా ఈ పని చేయడానికే మీకు ఉద్యోగం వుంది. జీతం దొరుకుతూ వుంది కద. మళ్ళీ పైనుంచి మేమెందుకు డబ్బులివ్వాలి. అంటె మీ ఇష్టమమ్మా. ఇష్టముంటే ఇయ్యండి లేకపోతే లేదు అని కోపంగా వెళ్ళిపోయాడు. మళ్ళీ మా ఇంటికి మందు వేయటానికి రాలేదు" అంది లలిత.

"అంతే ఎవరి ఉద్యోగం వాళ్ళు నిర్వహించటానికూడా మనం ఇనామ్‌లు, మామూళ్ళు ఇస్తూ వుండాలి. అదీ పరిస్థితి. చెత్తనంతా తొలగించి నగరాలన్నీ, పట్నాలన్నీ శుభ్రంగా వుండాలంటే ఈ చెత్తకు విలువను కల్పించాలె. చెత్తకు విలువ రావాలంటే ఏదో కరెంటు ఉత్పత్తి చేసేవో, ఎరువును తయారీ చేసేవో, ఫ్యాక్టరీలు రావాలె! అప్పుడు చూడు భూతద్దంపెట్టి వెతికినా చెత్త కన్పించదు ఎక్కడా" లలిత వైపు చూసి చిరునవ్వుతో అన్నాన్నేను.

"కల నిజమాయెగా..." అంటూ కూనిరాగం తీసింది లలిత. ✦

"పిచ్చివాళ్ల ప్రపంచం"

హిందీ నాటకం

ఒక మంచివాణ్ణి తెచ్చి పిచ్చాసుపత్రిలో పడేస్తే ఎలా వుంటుందో అలా వుంది "రూం. నంబరు 13-బ్లాక్ నంబరు14" నాటకం. "ఆలియా భోగసి" అనే మరాఠీ నాటకానికి హిందీ రూపాంతరం ఇది. మరాఠీ మూలానికి రచయిత శ్రీకాంత్ సింకర్. హిందీ అనువాదం అనంత్ కులకర్ణి.

జ్వాలాముఖి

"సూత్రధార్" అనే నటుల తయారీ సంస్థవారు ఇటీవల హైదరాబాద్, ఆంధ్రసారస్వత పరిషత్తు హాల్లో ప్రదర్శించారు. మండే ఎండాకాలపు ఉక్కపోతరోజున కూడా హాల్లో జనం కిక్కిరిసిపోయారు. వినయ్‌వర్మ (నటుడు ప్రయోక్త), భాస్కర్ శివాల్కర్ ఈ "నటనాశిబిరం" దర్శకులు, నిర్వాహకులు. ఆ రోజు నాటక ప్రియులకు పర్వదినం.

దాదాపు గంటసేపు సాగిన ఈ నాటకంలో పదకొండు మగపాత్రలు. అందరూ పిచ్చివాళ్ళే. చిరునామా విషయంలో పొరపాటు పడి ఒక మంచివాణ్ణి, పిచ్చివాడనుకొని తెస్తారు. తాను "పిచ్చివాడిని కాదు'' అని ఎంత చెప్పినా వినిపించుకోరు. ఒకడికి నాట్యం పిచ్చి. వాడస్తమానం నాట్య భంగిమలతో అప్రస్తుత ప్రసంగం చేస్తాడు. మరొకడు దర్జీవాడు. వీడు తటస్థపడిన ప్రతివాడి చొక్కా, లాగుల కొలతలు తీసుకుంటాడు. మరొకడు చక్రవర్తిలా ఆజ్ఞలు జారీ చేస్తుంటాడు. మరొకడు సినిమా పిచ్చిలో షూటింగ్ చేస్తుంటాడు. వాడు "భేజా" టీ.వి. వాడు. ("భేజా" అనగా "మెదడు" అని అర్థం) మరొకడు రైలు రాకపోకల్ని "డింగ్-డింగ్" అంటూ ప్రసారం చేస్తాడు. ఈ రైల్వే ఉద్యోగి ఒక యాక్సిడెంటు అనర్థాన్ని చూసి మతి చలించడంవల్ల ఇక్కడికి వస్తాడు. మరొకడు ప్రొఫెసరు. విజ్ఞాన శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ గురించి, గురుత్వాకర్షణ శక్తి గురించి క్లాసులో బోధిస్తూనే వుంటాడు. అల్లరిచిల్లరగా ఉండే క్లాసులో లాగా "సైలెన్స్- సైలెన్స్" అంటూ అలిసి పోతాడు. ఇలా ఎవరు ఎవర్ని సంబోధిస్తున్నారో, ఎందుకు సంబోధిస్తున్నారో ఎవరికీ తెలియదు. ఎవరి పిచ్చి వారిది. వీళ్లకు చికిత్స చేయడానికి వచ్చిన డాక్టరు వీళ్లతో వేగలేడు. వీడికో అసిస్టెంటు. ఈ పిచ్చివాళ్ళ ఆసుపత్రిని తనిఖీ చేయడానికి ఒక పై అధికారి వస్తాడు. అతడు అందరినీ చూసి, తనక్కాబోయే అల్లుడు ఇందులో వున్నాడని గ్రహిస్తాడు. "నేను పిచ్చివాణ్ణికాను" అని మొదట్నుంచీ మొత్తుకున్నవాడే కాబోయే అల్లుడు. తీరా ఆరా తీసి, "అటెండెంటు"ను విచారించగా పిచ్చెక్కిన వాడి చిరునామాను గుర్తించడంలో జరిగిన పొరపాటువల్ల వ్యవహారం చెడి ఒక మంచివాడు పిచ్చివాడుగా పిచ్చాసుపత్రిలోకి లాక్కురాబడతాడు. వాడు ఏడుస్తూ తన గోడు వినిపిస్తాడు. దాంతో సుఖాంతం అవుతుంది. మంచివాడు బైట పడతాడు.



నాటకాన్ని చూస్తున్న యశ్వంత్‌సిన్హా

గజిబిజిగా కనిపించే ఈ నాటక ప్రక్రియ మూలాధారం ''ఆంగికం''(బాడీ), ''బుద్ధి''(మైండ్), "కంఠం"(వాయిస్)లు. వీటి నిరుప్త అభివ్యక్తి ద్వారా నాటకం రక్తి కడుతుంది. ఒకడు రాజులా అరిస్తే, మరొకడు ప్రొఫెసరు-శాస్త్రవేత్తలా చర్చిస్తాడు. ఒకడు రైలు రాకపోకల్ని ప్రకటిస్తే, మరొకడు సినిమాతీస్తూ "కట్-కట్" అంటాడు. ఆసక్తికరంగా గంటసేపు నాటకం నడుస్తుంది. ఇది సంభాషణ ప్రధాన నాటకం కాదు. ఒక మాట చివరను అందుకొని మరొకరు మాట్లాడడం అనేది వుండనే వుండదు. ఏదీ "పాత్ర" అనిపించదు. ప్రతివాడు తప్పిపోయిన వాడిగా మాట్లాడుతాడు. ప్రతి వాడి వెనక ఒక "విషాదం" వుంటుంది. అది వినోదమై కూచుంటుంది. "నేను పిచ్చివాణ్ణికాను" అనేది ఊతపదంలా ఉండిపోతుంది. ఎవరూ ఎవర్నీ గుర్తించరు. గుర్తించాల్సిన డాక్టర్ల, అధికార్ల నిర్లక్ష్యం వల్ల మంచివాళ్ళు మానసిక రోగులై మగ్గుతారు.

"భావావేశాలు" చమత్కార ప్రదర్శనలుగా కనిపిస్తాయి. ప్రతివారు "తన ప్రపంచం", తనను తాను పోగొట్టుకుంటారు. ఇదీ "వర్క్‌షాపు" ప్రదర్శనగా రక్తికట్టిన "పిచ్చివాళ్ల ప్రపంచం" హిందీ నాటకం.

ఎన్.డి.ఏ మాజీ కేంద్రమంత్రి 'యశ్వంత్ సిన్హా' (బీహారీ) ప్రేక్షకుడుగానే కాక "జీ" టీ.వి. యాంకర్‌గా వచ్చి నాటకాన్ని పరామర్శించారు. ఆయన ఈ నాటకాన్ని చూసి ఎంతో ప్రభావానికి లోనయ్యారు.

రంగస్థల కళ చాలా అభివృద్ధి చెందింది. పాశ్చాత్య నాటక ప్రభావం వల్ల "థియేటర్ కళ" వచ్చింది. నాటక కళలో చాలా ఆధునికతను చేకూర్చింది కానీ వస్తువు రిత్యా అభివృద్ధి చెందలేదు. "కన్యాశుల్కం", "మా భూమి"లాంటి సాంఘిక నాటకాలు రావడంలేదు. "పడమటి గాలి" నాటకం వచ్చింది కానీ ఆ ఒక్కటీ చాలదు. అలా రాకపోవడానికి కమిట్‌మెంట్ లేకపోవడమే. అయితే ఈ "పిచ్చివాళ్ళ ప్రపంచం" హిందీనాటకంలోని యువకుల్ని చూస్తుంటే.... జీవితానికీ-సమాజానికి, వృత్తికీ-ప్రవృత్తికి వచ్చిన వైరుధ్యాల్లో పోరాడి రాటుదేలి, ఒక కొత్తవస్తువు కనుగొంటారనే ఆశ తప్పక పుడుతుంది. ✦

ఈ క్షణం

ఈ క్షణంలో
కనురెప్ప మూసేటంతలో
ఏమేమి జరుగుతూ ఉందో
మన ప్రపంచంలో
మన ఇరుగు పొరుగులో పక్కింట్లో
బయట రోడ్డులో
అవతల తోటలో
యుద్ధరంగాలలో
ఆస్పత్రులలో
జైళ్ళలో, లాకప్పులలో
మరెన్నో చోట్ల
నీ మటుకు ఈ క్షణం
నిశ్చలంగా ఉండొచ్చు
ఏమీ జరగనట్టే ఉండొచ్చు
సమయం ఆగిపోయినట్లనిపించవచ్చు
ఏమీ తోచకపోవచ్చు
కాని ఈ క్షణంలో
కనురెప్ప మూసేటంతలో
ఎక్కడో నరకం తాండవిస్తూ ఉంటుంది
హత్యలు, కాల్పులు, హింసలు, చిత్రహింసలు
నిస్సహాయమైన రోదనలు
వికటాట్టహాసాలు
ఆకలిబాధలు
అజీర్తి రుగ్మతలు
నిజానికి ఆలోచిస్తే
ఏమీ జరగని ఈ క్షణంలో
ఎన్నో జరుగుతున్నాయి
వీటి గురించి
ఈ రాత్రికి మీరు వింటారు
లేదా రేపటి పత్రికలలో చదువుతారు
ఇది కేవలం తేలుతున్న హిమపర్వతశిఖరం
దాని అడుగున నలుగుతున్నది
మానవజాతి సమస్తం
ఈ విధ్వంసాన్ని, స్వయంకృతాన్ని
మౌనంగా వీక్షిస్తోంది ఈ క్షణం

-డా॥ జె.భాగ్యలక్ష్మి

బొమ్మో? బొరుసో?

ముట్టిని పెకలించాడు
తనకో గూడు కావాలి
నమ్మిన సిద్ధాంతం
వమ్ము చేసినా
ఆడ ఋతువులపై ఆసహ్యం
అసహనం, అశాంతి, అవిశ్వాసం
అనాగరిక అలజడి ముందు
కట్టుకున్న మూగతాళి అరణ్యఘోష
అణా పైసా ఎగరేశాడు బొమ్మో? బొరుసో?!
అతని నింరతర తపన
వారసత్వం కోసం
ఆలోచన ఆకారం, సాకారం
మరో అద్భుత సృష్టి కార్యం
చదువు అబ్బాయిది
చాకిరి ఆడతనానికి బహుమతి?!
అతని ముఖమో ఫ్లాష్‌లైటు
ఆడపిల్లల్ని గడపదాటించాడు
అతడో నెత్తుటి ప్రవాహం
అంతై, ఇంతై, అల్లంత ఉన్నతుడై
ప్రవాసాంధ్రుడుగా వారసుడు
కూటికోసం, గూటికోసం
అలసిపోయిన రెక్కలు
కళ్ళనిండా చీకటి మబ్బులు
కసిగా కుత్తక కోసేసినట్లు
లింగ వివక్ష పశ్చాత్తాపం
ఇప్పుడతని దేహమంతా కోటికళ్ళు
ఆనందబాష్పాలతో
జిలుగు వెలుగు ఆడ జాబిల్లుల ఓదార్పుతో...

- అనామిక

ఫ్లై ఓవర్

ఈ రాత్రివేళ
ఫ్లై ఓవర్ అంచు నుండి
దూసుకొస్తున్న కార్లు...
ఆకాశం జల్లెడ నుండి
రాలుతున్న ఉల్కల్లా...
పార్కు జారుడుబండ నుండి
కేరింతలతో జారుతున్న
పిల్లల్లా...
పదచిత్రాల సంగతిసరే!...
కొందరికైతే
ఈ ఫ్లై ఓవర్లు
ప్రగతికి లాంఛింగ్ ప్యాడ్లు...
నాకైతే ఈ ఫ్లై ఓవర్
ఎగరలేక నేలమీదే నిలబడిపోయిన
పక్షిలా...
గ్రామీణ భారతపు విరిగిన
వెన్నుముకలా...
సౌకర్యం సరే...
అయినా అందరికీ అందని సౌకర్యం
స్వార్థం తప్ప మరొకటి కాదు
అసమస్య గతి
ఎన్ని ముచ్చి కాగితాలు చుట్టినా
అసమంజసమే ముమ్మాటికీ...
'అధివాస్తవికత' వంటి
'అధి అసహజానికి' ప్రతీక
ఈ ఫ్లై ఓవర్
నగరపు నడమంత్రపు సిరి
ఈ ఫ్లైఓవర్
త్రిశంకు స్వర్గపు గుమ్మం
ఈ ఫ్లై ఓవర్!

-ఎస్. హనుమంతరావు

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

పుట్టినతేదీ మార్పు ఇప్పుడు సాధ్యంకాదు

2002 సం॥లో ఉపాధ్యాయునిగా జాయిన్ అయ్యాను. నాది పుట్టినతేదీ ప్రైమరీ స్కూల్‌లో ఒకటుంది. హై స్కూల్‌లో ఒకటి ఉంది. అయితే ప్రైమరీ స్కూల్‌లో 15-6-1980 ఉంది. హై స్కూల్‌లో 15-5-1977 అని ఉంది. అసలంటే నేను పుట్టిన తేది నా కజిన్ బ్రదర్ కన్నా ఎక్కువ ఉంది. మా కజిన్ బ్రదర్ నాకన్న ఒక సంవత్సరం పెద్ద. నవంబర్ నెలలో మా పెద్దనాన్న చనిపోయారు. అతని డైరీలో చూస్తే నా డేట్ ఆఫ్‌బర్త్ 15-6-1980 అనే ఉంది. సలహా ఇవ్వగలరు.

ఎస్.ఎస్. సింగ్

మెదక్.

మీరు పెట్టినతేది హైస్కూల్లో ఉన్నది. 1977 అన్నారు. అంటే మీ సర్వీసు బుక్‌లో కూడా అదే ఎక్కించి ఉంటారు. మీరు దీనిలో మార్పు కావాలనుకొంటే ఉద్యోగంలో చేరిన సం॥లోపునే అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ల్లో అప్లికేషన్ (దావా) వేయాల్సి ఉంటుంది. ఇప్పుడు మీకా అవకాశం లేదు.

పొరుగువారి చెట్లు మా ఇంటిని పాడు చేస్తున్నాయి

మా యింటికి తూర్పున ఒక ఇల్లు ఉంది. వాళ్ళకి మాకు మధ్యలో 6 అడుగుల ఖాళీ స్థలం ఉంది. అది వాళ్ళది. ఈ ఖాళీస్థలములో వాళ్లు మామిడి, కొబ్బరి, అరటి చెట్టు వేసారు. వాటివలన మా గోడకు, పునాదులకు ప్రమాదమని అందరూ అంటున్నారు. వాళ్ళతో ఎన్నిసార్లు చెప్పిన వినిపించుకోవడము లేదు. ఈ మధ్య కొబ్బరిచెట్టు కొమ్మ మా లావెట్రి పైపు మీదపడి పైపు విరిగిపోయినది. ఆ విషయము చెప్పినా వాళ్లు పట్టించుకోవడము లేదు. దీనికి సరియైన సలహా ఇవ్వగలరు.

జి. రాజశేఖర్,

పాలకొండ.

మీరు మీ పరిధిలో గ్రామ పరిధిలో పరిష్కారమయ్యే అవకాశం ఉంటే చూడండి లేదా మీ దగ్గరలోని కోర్టులో 'ఈజియొంట్ ఆక్ట్' క్రింద దావావేసి మీకు జరుగుతున్న నష్టాన్ని వివరించి వాటిని తీయించుకోవచ్చు. అలాగే మీకు జరిగిన నష్టపరిహారాన్ని కూడా పొందవచ్చు.

చెక్కు వాపసువస్తే...

నేను పదవీ విరమణ చేసినప్పుడు వచ్చిన డబ్బులో నా కుమారుడు మళ్ళీ ఇస్తానని ఒక లక్షరూపాయలు తీసుకున్నాడు. ఆ డబ్బు ఎప్పుడు కావాలన్నా బ్యాంకు నుంచి తీసుకోమని నా పేరిట క్రాసు చెక్కు ఇచ్చినాడు. తేదీ వేయకుండ ఇచ్చినాడు. కొన్ని రోజులకు నేను బ్యాంకుకు పోయి చెక్కు బ్యాంకులో వేయకుండా అతని అకౌంటు నంబరుపై డబ్బు ఉన్నదా అని అడిగితే లేదని చెప్పినారు. వెంటనే నా కుమారుని దగ్గరకుపోయి జరిగిన విషయచెప్తితే ప్రస్తుతము నా దగ్గర డబ్బులేదు. ఉన్నప్పుడు ఇస్తాలే అని అంటున్నాడు. ఈ విషయంలో ఏ విధమైన వ్రాతపూర్వకమైన కాగితాలు లేవు. నేను చెక్కు బ్యాంకులో సబ్మిట్ చేసి, డబ్బులేదని వాపసు వచ్చిన తర్వాత నేను ఏం చేయాలి. ఏ కోర్టుకు పోవాలి. ఎంత ఖర్చు అవుతుంది. నాకు న్యాయం జరుగుతుందా.

జె. కిష్టయ్య,

చిక్కడపల్లి, హైదరాబాద్.

అటువంటి చెక్కును డేటువేసి మీ అకౌంటుగల బ్యాంకులో వేసుకుని నగదు లేదా రశీదును మీ బ్యాంకు వారి ద్వారా పొంది తగు సమయంలో నోటీసు ఇప్పించుకుని కేసు వేయవచ్చును. క్రిమినల్ కేసుగాని, సివిల్ దావా గాని వేయవచ్చు. క్రిమినల్ కేసునందు అతడికి శిక్షపడుతుంది. సివిల్ కేసునందు మీరు కోర్టుఫీజు చెల్లించి దావా వేయవలసి ఉంటుంది. మీ దగ్గరలోని కోర్టులో దావా వేయవచ్చును.

అప్పుఇచ్చాం... ఇవ్వనంటున్నాడు... ఎలా?!

మేము తెలిసిన వారికి 3 లక్షల రూపాయలు, ప్రామిసరీ నోట్లపై సంతకం పెట్టించుకుని అప్పుగా ఇచ్చాము. ఇప్పుడు డబ్బు అవసరం ఇమ్మని అడిగితే, నావద్ద ఏమీ లేదు అంటున్నాడు. వీళ్ళ వూరిలో అతని తల్లిగారి పేర చాలా ఖరీదైన ఇల్లు వున్నది. ఆవిడకు ఇద్దరు కుమారులు. మేము అతనిపై గాని, అతని తల్లి గారిపై గాని ఏమయినా కేసు వేస్తే మాకు న్యాయం జరుగుతుందా?

ఒక పాఠకుడు.

ఏ ఆస్తి పాస్తులు లేని అతడికి, ఏంచూసి అంత మొత్తం నగదు అప్పుగా ఇచ్చి ఉంటారు. అతని పేరిట ఏమీ లేదంటే అతడి తల్లిగాని, మరెవరైనా ఇస్తేనే అతడి నుంచి మీరు డబ్బు రాబట్టుకోగలుగుతారు. లేదంటే మీరు కోర్టులో దావా వేసి, డిక్రీ చేతికొచ్చిన తర్వాత అరెస్టుకోసం ఎగ్జిక్యూషన్ పిటిషన్ వేయండి. 6 నెలల వరకు జైల్లో ఉంచొచ్చు. ఆ పరిస్థితిల్లోనైనా వాళ్ళ వారు ఎవరైనా ఇవ్వవచ్చు. లేదంటే మాత్రం అతడి జైలు ఖర్చులు కూడ మీరే భరించాల్సి ఉంటుంది.

బియ్యం పిండి నూడిల్స్

కావలసిన వస్తువులు:

బియ్యప్పిండి	:	నాలుగు కప్పులు
వేయించిన నువ్వులపొడి	:	అరకప్పు
పెరుగు	:	ఒక కప్పు
నూనె	:	ఒక కప్పు
ఉల్లిపాయ ముక్కలు	:	ఒక కప్పు
అల్లం, పచ్చిమిర్చి పేస్టు	:	అర టీ స్పూన్
ఆవాలు	:	ఒక టీ స్పూన్
జీలకర్ర	:	ఒక టీ స్పూన్
మినపప్పు	:	ఒక టీ స్పూన్
కరివేపాకు	:	10 రెబ్బలు
ఉప్పు	:	తగినంత

తయారుచేసే విధానం

బియ్యప్పిండిని జల్లించి అందులో అల్లం, పచ్చిమిర్చి పేస్టు, పెరుగు, ఉప్పు తగినంత వేసి వేడి నీళ్ళతో జంతికల పిండి మాదిరిగా తడుపుకోవాలి. తరువాత రెండు వెడల్పాటి గిన్నెలు (కుక్కర్ గిన్నెలు) తీసుకొని నూనె రాసి, తడిపిన పిండిని జంతికల గొట్టంలో సరిపడినంత పిండి పెట్టి జంతికల మాదిరి ఒత్తుకోవాలి. ఆ గిన్నెలను కుక్కర్‌లో పెట్టి పావుగంట పాటు వెయిట్ పెట్టకుండా ఇడ్లీల మాదిరి ఉడికించాలి. ఉడికిన తరువాత చూస్తే బజారులో దొరికే నూడుల్స్ మాదిరిగా ఉంటాయి.

బాండీలో నూనె వేసి ఆవాలు, జీలకర్ర, మినపప్పు వేసి వేయించి వేగిన తరువాత ఉల్లిపాయ ముక్కలు వేసి అవి కూడా వేగిన తరువాత కరివేపాకు వేయాలి. ఇందులో ఆవిరిమీద ఉడికించిన నూడుల్స్ వేసి వాటిపై వేయించిన నువ్వుల పొడి, కొంచె ఉప్పు వేయాలి. వాటిని గరిటెతో కదపకుండా బాండీని కదుపుతూ ఉడికించాలి. పది నిముషాలు ఉడికిన తరువాత వేడిగా తినాలి. అందుబాటులో ఉంటే ఇందులో అరకప్పు టమాటా సాస్ కూడా చివరలో దించే ముందు వేసుకోవచ్చు.

బేసిన్ రోల్స్

కావలసిన వస్తువులు:

శనగపిండి	:	ఒక కప్పు
పెరుగు	:	ఒక కప్పు
ఆవాలు, జీలకర్ర	:	ఒక టీ స్పూన్
కారం	:	ఒక టీ స్పూన్
ఉప్పు	:	తగినంత
కొబ్బరి తురుము	:	నాలుగు టీ స్పూన్లు
నూనె	:	నాలుగు టీ స్పూన్లు
పసుపు	:	పావు టీ స్పూన్
కొత్తిమీర	:	చిన్న కట్ట
కరివేపాకు	:	నాలుగు రెబ్బలు
పంచదార	:	ఒక టీ స్పూన్
పచ్చిమిర్చి	:	రెండు

తయారుచేసే విధానం

ముందుగా పెరుగును కొంచెం నీళ్ళుపోసి చిలకాలి. అందులో శనగపిండి వేసి ఉండలు లేకుండా గరిటెజారుగా కలుపుకోవాలి. పసుపు, ఉప్పు, పంచదార కూడా వేసి కలపాలి. ఒక ప్లేట్‌లో కొంచెం నెయ్యి లేక నూనె రాసి కొంచె పిండిని పోసి పల్చగా సర్దాలి. వెడల్పాటి గిన్నెలో నీళ్ళుపోసి ఈ ప్లేట్‌ను పెట్టి ఐదు నిముషాలు ఉడికించాలి. ప్లేట్‌ను తీసి రెండు నిముషాల తరువాత పల్చని షీట్‌లా కన్పిస్తున్న శనగపిండిని నిలువుగా కోసి రిబ్బన్ మాదిరిగా చుట్టి రోల్స్ తయారు చేసుకోవాలి. మొత్తం పిండిని ఇలాగే చేయాలి. వీటిని ఒక వెడల్పాటి గిన్నెలో ఒకదాని పక్కన ఒకటి అమర్చాలి. కొంచెం నూనె వేడి చేసి తాలింపుచేసి ఈ రోల్స్ మీద పోయాలి. ఉప్పు, కారం, పచ్చిమిర్చి చీలికలు, కొబ్బరి పొడి, కొత్తిమీర చల్లి వడ్డించాలి. ఇవి వేడిగానూ, ఆరిన తరువాత కూడా చాలా రుచిగా ఉంటాయి.

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్ ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు. ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్: **కలం స్నేహం**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : పొడియం సంధ్యారాణి
వయసు : 11 సం॥
చదువు : 6వ తరగతి
హాబీలు : టీవీ చూడడం, పుస్తకాలు చదవడం, ఆటలు ఆడడం
చిరునామా : పొడియం సంధ్యారాణి, డాటరాఫ్ ముత్యాలరావు, సీతానగరం (గ్రా), పర్ణశాల (పోస్టు), దుమ్ముగూడెం (మం), ఖమ్మం.

పేరు : అభిమళ్ల సాయినాథ్
వయసు : 14 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : క్రికెట్, వీడియోగేమ్ ఆడడం, ప్రజాశక్తి, దీపిక చదవడం
స్కూలు : శ్రీమతి ఈదర సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూల్
లక్ష్యం : ఇంజనీర్ కావడం
చిరునామా : అభిమళ్ల సాయినాథ్, సన్నాఫ్ శ్రీనివాస్, ఇంటి నెం. 24సి-12-94/7, ఏటిగట్టు, డిఎంసి హాస్టల్ దగ్గర, మంచినీళ్లతోట, ఏలూరు-534002.



పేరు : చింతలచెరువు నవీన్
వయసు : 14 సం॥
చదువు : 8వ తరగతి
హాబీలు : క్రికెట్ ఆడడం, టీవీ చూడడం, ప్రజాశక్తి పేపరు చదవడం
స్కూలు : జడ్‌పిహెచ్‌ఎస్, జానకీపురం
చిరునామా : చింతలచెరువు నవీన్, సన్నాఫ్ సిహెచ్. అనంతరావు, పెద్దబీరవల్లి (గ్రా), బోనకల్ (మం), ఖమ్మం.

పేరు : ఓరు ప్రత్యూష రెడ్డి
వయసు : 11 సం॥
చదువు : 6వ తరగతి
హాబీలు : పాటలు పాడడం, ప్రజాశక్తి చదవడం, క్యారమ్స్ ఆడడం
చిరునామా : ఓరు ప్రత్యూష రెడ్డి, డాటరాఫ్ సురేష్ రెడ్డి (టీచర్), పెద్ద బ్రాహ్మణ వీధి, టెక్కలి, శ్రీకాకుళం-532201.

పేరు : ఠాకూర్ సోనీబాయి
వయసు : 15సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : చదవడం, రాయడం, పాటలు పాడడం, ప్రజాశక్తి చదవడం, ఆటలు ఆడడం
లక్ష్యం : డాక్టర్ కావడం
స్కూలు : సబర్మతి హైస్కూల్
చిరునామా : ఠాకూర్ సోనీబాయి, డాటరాఫ్ టి.లక్ష్మణ్ సింగ్, క్వార్టర్ నెం.ఎస్‌డి-191, జెకె కాలనీ, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఎదురుగా, ఇల్లందు, ఖమ్మం-507123

పేరు : యు.శ్రీనివాసరావు
వయసు : 14 సం॥
చదువు : 8వ తరగతి
హాబీలు : ప్రజాశక్తి చదవడం, క్రికెట్ ఆడడం, చదవడం, టీవీ చూడడం.
చిరునామా : యు.శ్రీనివాసరావు, సన్నాఫ్ నాగేశ్వరరావు, గుల్లపాడు (గ్రా), మాచర్ల (మం), గుంటూరు.

పేరు : పానుగంటి క్రాంతికుమార్
వయసు : 12 సం॥
చదువు : 6వ తరగతి
హాబీలు : క్రికెట్ ఆడడం, డ్రాయింగ్ వేయడం, టీవీ చూడడం
స్కూలు : ఎన్‌పి సుబ్బారెడ్డి సెంట్రల్ స్కూల్
లక్ష్యం : సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావడం
చిరునామా : పానుగంటి క్రాంతికుమార్, సన్నాఫ్ హరికృష్ణ, చెన్నారెడ్డి కాంపౌండ్, షాషాబ్ గుట్ట, మహబూబ్‌నగర్-509001.

పేరు : జుట్టుకొండ శిరీష
వయసు : 14 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : టీవీ చూడడం, ప్రజాశక్తి చదవడం, అల్లరి చేయడం, ఆటలు ఆడడం
లక్ష్యం : టీచర్ కావడం.
చిరునామా : జుట్టుకొండ శిరీష, డాటరాఫ్ లక్ష్మయ్య, కీతవారిగూడెం (గ్రా), గరిడేపల్లి (మం), నల్గొండ-508201.